




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

విజయవాడ VIJAYAWADA | సంపుటి : 25 Vol.No : 25 | సంచిక : 71 Issue No : 71 | ది. 17-6-2026 Date : 17-6-2026 | బుధవారం Wednesday | పేజీలు : 8 Pages : 8 | వెల : రూ.1/- Rs.1/-


## వారానికి 5 రోజుల పని విధానం మరో ఏడాది పొడిగింపు

**అమరావతి,జూన్ 16 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం, వివిధ శాఖాధిపతుల కార్యాలయాలు,పలు కార్పొరేషన్లు, ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగుల 5 రోజుల పని దినాల విధాన్ని మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి(పొలిటికల్) జె.శ్యామల రావు జిఓ ఎంఎస్.సంఖ్య:71 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఈనెల 27వ తేదీ నుండి అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. వారానికి 5 రోజుల పని దినం ఉదయం 10 గం.ల నుండి సా.5.30 గం.ల వరకు ఉంటుందని తెలిపారు.

# అవకాశాలకు నెలవు అమరావతి

- సరికొత్త ఆలోచనలతో రావాలని సీఎం చంద్రబాబు ఆహ్వానం
- సింగపూర్‌లో 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో ముఖ్యమంత్రి ప్రసంగం
- సింగపూర్ పెవిలియన్, ఇన్నోవేటర్స్ అలే, గూగుల్ స్టాల్ సందర్శన



**సింగపూర్,జూన్ 16 (వార్తాప్రభ) :** అంతర్జాతీయ మౌలిక వసతులతో నిర్మిస్తున్న రాజధాని అమరావతిలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సరికొత్త ఆలోచనలతో రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెట్టుబడిదారులను ఆహ్వానించారు. సింగపూర్‌లో రెండవ రోజు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్ షిప్ ప్లీనరీ-2లో పాల్గొని 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్రసంగించారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని... జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు వస్తున్నాయని సీఎం చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటివి అమరావతికి ప్రత్యేకత తీసుకువస్తాయని వివరించారు. అమరావతిని ప్రజా రాజధానిగా, ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా నిర్మితమవుతోందని స్పష్టం చేశారు. ఈక్విటీ, నేచర్, ఆపర్చ్యునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందన్నారు. 21 కి.మీ. కృష్ణానది పొడవునా వాటర్ ఫ్రంట్ నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని..., అలాగే ఇన్నర్ - ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలతో అద్భుతంగా నిలుస్తుందని చెప్పారు. స్పోర్ట్స్, ఫైనాన్సియల్, నాలెడ్జ్, జస్టిస్, టూరిజం, హెల్త్, మీడియా వంటి థీమ్ లతో అమరావతిని నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, అండర్ గ్రౌండ్ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా ఒకే ఒక్క పిలుపుతో రాజధాని నిర్మాణం కోసం రైతులు 35 వేల ఎకరాలను అప్పగిస్తే... వాటిని అభివృద్ధి చేసి కొంత భాగాన్ని రైతులకు తిరిగి ప్లాట్లుగా ఇచ్చామని వివరించారు. 25 ఏళ్ల క్రితం తాను ఐటీ గురించి మాట్లాడానని... ఐటీ భవిష్యత్‌ను ఆరోజే ఊహించి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకోవడంతో... ఇవాళ తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో అందరికన్నా ముందున్నారని సీఎం అన్నారు. ఇప్పుడు ఏఐ గురించి ఆలోచన చేస్తున్నామన్నారు. నాడు తాను నిర్మించిన సైబరాబాద్... నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయ వనరుగా మారిందన్నారు. సైబరాబాద్‌లో నాడు ఎకరం రూ.2 లక్షలు ఉంటే... నేడు ఎకరం రూ.200 కోట్లకు పెరిగిందన్నారు. అభివృద్ధి జరిగితే సంపద సృష్టి సాధ్యమవుతుందని చెప్పేందుకు సైబరాబాద్ నిదర్శనమని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజనతో మరోసారి కొత్త నగరాన్ని నిర్మించే అవకాశం తనకు లభించిందన్నారు. ప్రసంగం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సింగపూర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించారు. సింగపూర్ పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక పట్టణాభివృద్ధి నమూనాలను సీఎం ఆసక్తిగా తిలకించారు. ఇన్నోవేటర్స్ అలేలో స్టార్టప్‌ల ఆవిష్కరణలను, గూగుల్ స్టాల్‌ను పరిశీలించారు. టెక్నాలజీ ఆధారిత పాలనలో సింగపూర్ అనుభవాలను తెలుసుకున్నారు.

# నమామి గంగే తరహాలో క్లీన్ గోదావరిని ప్రక్షాళన చేయండి

- స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాల నిర్వహణకు సహకరించండి
- కేంద్ర జల్ శక్తి మంత్రి సి ఆర్ పాటిల్ ని కలసిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- గోదావరి కాలుష్య నివారణ, సవాళ్లపై చర్చ



**న్యూఢిల్లీ, జూన్ 16 (వార్తాప్రభ) :** నమామి గంగే ప్రాజెక్టు తరహాలో క్లీన్ గోదావరి నది ప్రాజెక్టుని చేపట్టి గోదావరి నది ప్రాశస్త్యాన్ని కాపాడేలా కేంద్ర తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ ని కోరారు. వచ్చే ఏడాది జరగబోయే గోదావరి పుష్కరాలను స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాలు థీమ్ తో చేపడుతున్నామని చెప్పారు. దీనికి అనుగుణంగా గోదావరిని స్వచ్ఛంగా మార్చేందుకు కేంద్రం అందించే సహకారం చాలా అవసరం అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ తో పవన్ కళ్యాణ్ సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి కోట్లాది మంది వస్తారు. వారికి గోదావరినది గొప్పతనం తెలిపేలా, నదిని అత్యంత శుభ్రంగా ఉంచాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచన. అయితే గోదావరి నది కాలుష్యం, శుద్ధి చేయని నీరు ప్రత్యక్షంగా నదిలో కలవడం వంటి సవాళ్లు ముడిపడి ఉన్నాయి. వీటిని అధిగమించేందుకు కేంద్రం తగిన విధంగా సహకారం అందించాలి. మున్సిపాలిటీల్లో నీటి శుద్ధి కేంద్రాలను మరిన్ని నిర్మించి మురుగు నీటిని గోదావరిలో కలవకుండా నివారించాల్సిన అవసరం ఉంది. దీనిపై కేంద్ర మంత్రివర్యులతో సుదీర్ఘంగా చర్చించాం. ఎక్కడి నుంచి కాలుష్యం అధికంగా ఉంది.. నివారణ చర్యలు ఎలా తీసుకోవాలి అనే అంశాలను చర్చించాం. ఘన, ద్రవ వ్యర్థాలు గోదావరిలో ప్రత్యక్షంగా కలవకుండా ఎలా నివారించాలి అన్న అంశాలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్ళామన్నారు. పుష్కరాలకు ముందే గోదావరి కాలుష్యాన్ని నివారించే చర్యలు తీసుకుంటాం. దీనికి కేంద్రం కూడా తగిన విధంగా సహకరిస్తుంది కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. పుష్కరాలను కాలుష్య రహితంగా ఎలా నిర్వహించవచ్చు అన్న అంశాలతో మంత్రి కి నివేదిక రూపంలో అందించాం. కేంద్ర మంత్రి ఆ నివేదికను పరిశీలించి కూటమి ప్రభుత్వ విజన్ ను అభినందించారన్నారు. పుష్కరాల నిమిత్తం మోడల్ పంచాయతీల అభివృద్ధి, భక్తుల రద్దీ నియంత్రణ, సౌకర్యాల కల్పన అంశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రణాళికలు అద్భుతంగా ఉన్నాయని కేంద్ర మంత్రి ప్రశంసించారు. గతంలో సూరత్, వారణాసి, ప్రయాగ్ రాజ్ లలో నిర్వహించి మహాకుంభ్ లో చేసిన ఏర్పాట్లు, భక్తుల రద్దీ నియంత్రణ తరహా మోడల్ ను వచ్చే పుష్కరాల్లో అమలు చేసే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సహకరించాలని కోరాం. జల్ జీవన్ మిషన్ కు కేంద్రం నుంచి మరింత సహకారం అందించాలని కోరామ"ని అన్నారు.

# జులై మూడో వారంలో తల్లికి వందనం!

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపునకు ప్రత్యేక చర్యలు
- జూన్ 29న షైనింగ్ స్టార్స్ కార్యక్రమం నిర్వహణ
- సెట్ లను సకాలంలో నిర్వహించండి
- రాష్ట్రానికి ఎన్ సీసీ స్టేట్ యూనిట్ మంజూరు
- విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష

**అమరావతి,జూన్ 16 (వార్తాప్రభ) :** ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం త్వరితగతిన అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య అధికారులతో మంత్రి లోకేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం, బడి పిలుస్తోంది, షైనింగ్ స్టార్స్, మెగా పీటీఎం, యోగాంధ్ర, టెట్ నిర్వహణ అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థుల ప్రవేశాల పెంపు పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి.. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని, జులై 3వ వారంలో పథకం అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. జూన్ 29న షైనింగ్ స్టార్స్ కార్యక్రమం, జులై మూడో వారంలో మెగా పీటీఎం నిర్వహణకు సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల పని సర్దుబాటుపైనా సమావేశంలో చర్చించారు.



**ఉన్నత విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష..** రాష్ట్రంలో ఎప్ సెట్, పాలిసెట్, ఆర్ సెట్ వంటి 12రకాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లకు ఎటువంటి జాప్యం లేకుండా సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత సమయంలో అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే సెట్స్, పొరుగు రాష్ట్రాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ల తేదీలను కూడా గమనంలోకి తీసుకొని విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్రంలోని వివిధ సెట్ ల తేదీలను ఖరారు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో మెకానికల్, సివిల్ విభాగాల సీట్లకు డిమాండ్ ఉందని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ కు సంబంధించి 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88లక్షల సీట్ల భర్తీకి గాను ఎప్ సెట్ నోటిఫికేషన్ కు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో యూనివర్సిటీల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ, మేధావి స్కిల్ యూనివర్సిటీ, జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలతో చర్చల పురోగతిపై మంత్రి సమీక్షించారు. జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు ను వేగవంతం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్‌సీసీ కార్యకలాపాలు, శిక్షణ, క్యాంపులు సమన్వయం చేయడానికి ఎన్‌సీసీ (చీజజ) స్టేట్ డైరెక్టరేట్‌ను మంజూరు చేసిన కేంద్రప్రభుత్వానికి మంత్రి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. దేశంలో ఎన్‌సీసీ వ్యవస్థను బలోపేతం చేయడానికి, ఆంధ్రప్రదేశ్ యువతకు మరింత సైనిక శిక్షణ, ప్రోత్సాహం అందించడానికి ఈ ప్రత్యేక కేంద్రం ఉపకరించగలదని అన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జే.శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్య కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సర్‌పై అత్యంత అప్రమత్తంగా ఉండాలి

- ఈ నాలుగు వారాలు అత్యంత కీలకం
- నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు రోజూ సమీక్ష చేయాలి
- ఏదోరకంగా వైయస్సార్‌సీపీ ఓట్లు తొలగించేందుకు చంద్రబాబు కుట్ర
- అధికార దుర్వినియోగంతో ఓట్లు తీసివేసేందుకు ప్రయత్నం
- ప్రతి బూత్‌కు 50 వైయస్సార్‌సీపీ ఓట్లు తీసేయాలని చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారు
- నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు దీన్ని అడ్డుకోవాలి, ప్రతి ఓటునూ కాపాడుకోవాలి
- వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు



**తాడేపల్లి,జూన్ 16 (వార్తాప్రభ) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ( సర్)పై నియోజకవర్గాల్లోని కో-ఆర్డినేటర్లు, రీజనల్ ఇన్‌ఛార్జిలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైయస్సార్ సీపీ అధ్యక్షుడు వైయస్. జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుపై ప్రతిరోజూ సమీక్ష చేయాలని, ఎక్కడైనా తప్పులు జరుగుతున్నాయని తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయలని, అప్పటికీ సమస్య పరిష్కారంకాకపోతే వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకు రావాలన్నారు. వచ్చే నాలుగు వారాలు అత్యంత కీలకమని, సర్ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వద్దన్నారు. సర్ ప్రక్రియలో ఒక్కసారి ఓటు తొలగించిన తర్వాత దాన్ని తిరిగి చేర్పించాలంటే అత్యంత కష్టమవుతుందన్నారు. ప్రతి నియోకవర్గ సమన్వయకర్త దీన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. మంగళవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులతో శ్రీ జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న చంద్రబాబు, తన అధికార దుర్వినియోగంతో ఏదోరకంగా వైయస్సార్‌సీపీకి చెందిన ఓట్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, బూత్‌కు కనీసంగా 50 ఓట్లు తొలగించాలని చూస్తున్నారన్నారు. గిమ్మిక్కులతో ఓట్లు తొలగించే తప్పుడు పనుల్లో చంద్రబాబు ఆరితేరిన వ్యక్తని, వైయస్సార్‌సీపీ కోఆర్డినేటర్లు, బూత్‌లెవల్ ఏజెంట్లు దీన్ని అడ్డుకోవాలని, ప్రతి ఓటునూ కాపాడుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్ ప్రక్రియపై ప్రతి అంశంలోనూ అప్రమత్తత, నిరంతర సమీక్షలు నిర్వహించాలని వైయస్.జగన్ ఆదేశించారు.

# బీసీ బాలికల విద్యకు భరోసా - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి,జూన్ 16 (వార్తాప్రభ) :** బీసీ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విజయనగరం జిల్లాలోని కొత్తవలస (బాలికల), ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని గోలగముడి, అన్నమయ్య జిల్లాలోని కలికిరి (బాలికల), వైఎస్సార్ కడప జిల్లాలోని ఓనిపెంట (బాలికల), ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు (బాలికల), శ్రీ సత్యసాయి జిల్లాలోని నాసనకోట (బాలికల) ఎంజేపీ గురుకులాల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన నూతన విద్యా సంవత్సరం నుంచి ఈ ఆరు గురుకుల కళాశాలల్లో మొదటి ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ప్రారంభం కానున్నాయన్నారు. ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. ఒక్కో గురుకుల కళాశాలలో ఎనిమిది అధ్యాపకులను పార్ట్ టైమ్ ప్రాతిపదికన నియమించనున్నామన్నారు. వారితో ఒక కుక్ ను, ల్యాబ్ అసిస్టెంట్ ను అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించనున్నట్లు తెలిపారు. ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు కళాశాల ప్రిన్సిపాళ్లగా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు.


## LOSS OF PASSPORT

I, Velpula Ramesh, S/o Velpula Ravi, R/o D.No. 7-62, Dakshina Bazar, Vutukuru Village, Gampalagudem Mandal, N.T.R.District, Andhra Pradesh – 521401, hereby inform that my Indian Passport bearing No. T3255787, issued at Vijayawada on 24.04.2019 and valid up to 23.04.2029, has been lost/misplaced. Despite diligent search, the same could not be traced. Any person finding or dealing with the said passport is requested to inform the undersigned or the nearest Police Station. Any unauthorized use of the passport shall be at the user's own risk and consequences.

Sd/- VELPULA RAMESH
Mobile: 6304364737
Whatsapp number : 9493885685


# ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే

- గుడిసెలు వేసుకున్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**హనుమకొండ,జూన్ 16 (వార్తాప్రభ) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, లేకపోతే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగి ప్రభుత్వంపై తిరుగుబాటు అనివార్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ జిల్లా గుండ్లసింగారం భూపోరాట కేంద్రంలో నిర్మించిన "సురవరం సుధాకర్ రెడ్డి నగర్" సిపిఐ కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ భూములపై గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేదలకు ఇప్పటికీ సొంత ఇల్లు లేదని, స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా పేదల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో అనేక ప్రాంతాల్లో భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలందరికీ ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని, పాలకులు పేదల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. కమ్యూనిస్టుల పోరాటాల వల్లే తెలంగాణ విముక్తి సాధ్యమైందని, ప్రజా హక్కుల పరిరక్షణలో కమ్యూనిస్టుల పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గుండ్లసింగారం కాలనీవాసులు ఎంతో దీక్ష, పట్టుదలతో కాలనీ నిర్మించుకుని ఆదర్శంగా నిలిచారని అభినందించారు. కాలనీలో నివసిస్తున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలు వచ్చేలా అధికారులతో, స్థానిక ఎమ్మెల్యేతో, అవసరమైతే ముఖ్యమంత్రితో కూడా మాట్లాడుతానని హామీ ఇచ్చారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గుడిసెవాసుల హక్కుల సాధన కోసం సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కాలనీలో విద్యుత్, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్.ఏ. స్టాలిన్, జిల్లా నాయకులు, కాలనీ ప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, వందలాది మంది కాలనీవాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించగా, ప్రముఖ సినీ గాయకుడు ఇమ్మడి అశోక్ ఆలపించిన ప్రజాగీతాలు, మహిళల కోలాట నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# చంద్రన్న పెళ్లి కానుక

## ప్రభుత్వ భరోసా ఉన్నట్టా? లేనట్టా!



**విస్సన్నపేట,జూన్ 16 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాలలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల వధువులకు ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో ప్రారంభించబడిన ఒక లక్ష్యిత సామాజిక సంక్షేమ పథకం చంద్రన్న పెళ్లి కానుక పేజీ అంతర్జాలంలో కనబడటం లేదని నవ వధువుల తల్లిదండ్రులు అంటున్నారు. సచివాలయాలు మీసేవ కేంద్రాలలు మరియు సిఎస్సి సెంటర్లు ఆన్లైన్ పేజీలో యాక్టివేట్ చేస్తే ఆడపిల్లల తల్లిదండ్రులు అప్లై చేసుకునే అవకాశం ఉంటుందని సర్వత్రా వినిపిస్తుంది. గత ప్రభుత్వంలో పేదలకు భరోసాగా ఉన్న నాటి వైయస్ఆర్ కళ్యాణమస్తు నేడు చంద్రన్న పెళ్లి కానుక అందిస్తారని సమాచారం ఉన్న కార్యరూపం దాల్చకపోవడం ఆడపిల్లలు కన్న తల్లిదండ్రులకు ఎదురుచూపులే మిగిలాయి అని అనుకుంటున్నారు.

# ప్రశ్నించే గొంతును తొక్కేస్తారా?

## తిరువూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ నల్లగట్ల స్వామి దాస్ ఆగ్రహం



**విస్సన్నపేట,జూన్ 16 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో ప్రశ్నించే గొంతు వైసిపి పార్టీ సోషల్ మీడియా ఫేస్బుక్ ఎకౌంటులను బ్లాక్ చేయడం పట్ల తుమ్మలపల్లి కళాక్షేత్రం అంబేద్కర్ విగ్రహం వద్ద తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాస్ నిరసన వ్యక్తం చేశారు. వైసిపి సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు దొడ్డ అంజిరెడ్డి సారధ్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణ మాజీ జడ్పీ చైర్పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఎన్టీఆర్ జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ సిర సాని ప్రకాష్, గిరిజన సంఘం జిల్లా నాయకులు మాజీ సర్పంచ్ దారా వత్ శ్రీనివాసరావు, వార్డ్ మెంబర్ పిల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ రీ వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు...



**కృత్తివెన్ను,జూన్ 16 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం లో మంగళవారం నాడు ఎండపల్లి లో196బూత్ మునిపెడ 171.172బూత్ లు అలాగే చెరుకుమిల్లి 197.198బూత్ లు బి ఎల్ ఓ లు తో పాటు బి ఎల్ ఎ లు ఇంటి ఇంటికి తిరిగి ఓటర్ వెరిఫికేషన్ చేయటం జరిగింది ఈ వెరిఫికేషన్ కార్యక్రమములో యూనిట్ ఇన్చార్జి తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య బి ఎల్ ఓ లు పడబక్కల శ్రీదేవి పాము శాంతి కాకర నాగలక్ష్మి,బాలస్వామి, బి ఎల్ ఎ లు దాసరి ఆదినారాయణ,కాకర బాలశౌరి గుమ్మళ్ళ రఘు పట్టపు రాంబాబు డి శివాజీ తోట శివాజీ డి సుబ్రహ్మణ్యం గంటా మురళీకృష్ణ మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఇంటి ముంగిళ్లకే పొడి చెత్తకు నిత్యవసరాలు...



**గుడ్లవల్లేరు,జూన్ 16 (వార్తాప్రభ) :** ఇంటి ముంగిళ్లకే స్వచ్ఛ రథంలో పొడి చెత్తకు నిత్యవసర సరుకుల్ని పంపిణీ చేస్తున్నట్లు పెంజెంద్ర గ్రామ కార్యదర్శి పామర్తి దుర్గా నాగ మల్లేశ్వరరావు తెలిపారు. గ్రామంలో స్వచ్ఛ రథానికి పొడి చెత్తను అందించిన స్థానికులు అందుకు బదులుగా నిత్యవసరాలను తీసుకున్నారు. ప్లాస్టిక్, ఓల్డ్ బుక్స్, స్టీల్, కార్డ్ బోర్డు, అల్యూమినియం, ఐరన్, పేపర్ వంటివి స్వచ్ఛ రథానికి అందజేసి దానికి బదులుగా పప్పు, ఉప్పు, కారం, సబ్బు లాంటి కిరాణా వస్తువులు పొందవచ్చునని నరసింహారావు చెప్పారు. ఇది స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా అందరూ సహకరించి మన ఊరిని శుభ్రంగా, పచ్చగా ఉంచాలని ఆయన కోరారు.



ఎన్టీఆర్ జిల్లా, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ ఇటీవల నియమితులైన బోగాని శ్రీనివాస్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించిన ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ ముప్పసాని రామక్రిష్ణ, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, రిటైర్డ్ డి.ఈ.ఈ. డొక్కు సుబ్బారావు తదితరులు

–విజయవాడ,జూన్ 16 (వార్తాప్రభ) :

# కాటమరాజు ఆలయాల ప్రతిష్ఠ కాపాడుతూ అన్యకాంతమైన భూమిని స్వాధీనం చేసుకోండి

● అధికారులకు అఖిల భారత కాటమరాజు సంస్కృతి పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ చింతల మోహన్ రావు వినతి





**నంద్యాల,జూన్ 16 (వార్తాప్రభ) :** మహానంది మండలం, శ్రీనగర్ మరియు బుక్కాపురం గ్రామపంచాయతీ పరిధిలో కాటమరాజు ఆలయాల ప్రతిష్టను కాపాడాలని అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని అఖిలభారత కాటమరాజు సంస్కృతి పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ చింతల మోహన్ రావు కోరారు. మహానంది మండలం శ్రీ నగరం వద్ద దొరి బావి సమీపంలో వెలసిన కాటమరాజు ఆలయ పునర్ ప్రతిష్ట కోసం చర్యలు తీసుకోవాలని అఖిలభారత కాటమరాజు సంస్కృతి పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు అధ్యక్షుడు డాక్టర్ చింతల మోహన్ రావు కోరారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ధనుంజయకు వినతిపత్రం అందజేశారు. శ్రీ నగరం సమీపంలో దొరి బావి వద్ద సుమారు 10 ఎకరాలు పైగా ప్రభుత్వ భూమిని స్థానికులు ఆక్రమించుకుని సాగు చేస్తూ కాటమరాజు ఆలయ వద్దకు వెళ్లడానికి దారిల్లేకుండా ఆక్రమించినట్లు పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా చరిత్ర కలిగిన దొరి బావి, స్థలం మరియు కాటమరాజు స్థలాన్ని ఆక్రమించారని విచారణ జరిపి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 10 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రజా అవసరాల కోసం వినియోగించుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బుక్కాపురం గ్రామ సమీపంలోని రాళ్లపాడు వద్ద కాటమరాజు విగ్రహం ఉందని పేర్కొన్నారు. కాటమరాజు విగ్రహ పరిసరాల్లో సుమారు మూడు ఎకరాల 50 సెంట్లు ప్రభుత్వ భూమిని స్థానికంగా ఆక్రమించుకొని కాటమరాజుకు పూజలందకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని కాటమరాజు ఆలయ ప్రతిష్టతను మరియు ప్రజల అవసరాల కోసం వినియోగించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు శ్రీనివాసులు శ్రీనివాసులు నాగన్న పలువురు పాల్గొన్నారు.

# "ఏం ఇంత బాధ... ప్రాణం తీసుకునేంత?" పుస్తకావిష్కరణ..



**ఆర్జీయూకేటీ, నూజివీడు,జూన్ 16 (వార్తాప్రభ) :** నేటి సమాజంలో ఒత్తిడి, నిరాశ, అపజయాలు, ఒంటరితనం వంటి సమస్యలతో అనేక మంది మానసికంగా కుంగిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జీవితంపై ఆశ కోల్పోయే వారికి ధైర్యం, ప్రేరణ కలిగించాలనే ఉద్దేశంతో రచించబడిన "ఏం ఇంత బాధ... ప్రాణం తీసుకునేంత?" అనే పుస్తకాన్ని ఆర్జీయూకేటీ (RGUKT) ఆంధ్రప్రదేశ్ ఉపకులపతి ప్రొఫెసర్ ఎం. లక్ష్మీనారాయణ రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సాండ్రా, ఆర్జీయూకేటీ నూజివీడు డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.ఎస్.ఎస్.వి. గోపాల రాజు, డీన్ ఆఫ్ అకడమిక్స్ శ్రీమతి డి. శ్రావణి, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ డి.వి. నాగార్జున దేవి, నూజివీడు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ బి. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు." ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేటి యువత మరియు సమాజంలోని ప్రతి ఒక్కరికీ మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఎలాంటి సమస్య వచ్చినా "ప్రాణం కంటే గొప్పది మరొకటి లేదు" అనే సందేశాన్ని ఈ పుస్తకం బలంగా చాటుతుందని పేర్కొన్నారు. ఈ పుస్తక రచయిత గుమ్మడిదల జయకృష్ణ మాట్లాడుతూ, "ప్రస్తుత కాలంలో చాలా మంది ఒత్తిడి, డిప్రెషన్, అపజయాలు, ఒంటరితనం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. కొన్నిసార్లు వారికి ముందుకు వెళ్లే దారి కనిపించకపోవచ్చు. అయితే ఏ సమస్యా జీవితానికంటే పెద్దది కాదు అనే సందేశాన్ని అందించాలనే సాధారణ ఉద్దేశంతోనే ఈ పుస్తకాన్ని రచించాను. ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే సమస్యలను అధ్యాయాల వారీగా వివరించి, వాటి నుంచి ఎలా బయటపడవచ్చో ఇందులో చర్చించాను. కష్టకాలంలో ఉన్న వారికి ప్రోత్సాహం, స్ఫూర్తి, మద్దతు అందించాలనే చిన్న ప్రయత్నమే ఈ పుస్తకం" అని తెలిపారు. ఈ పుస్తకం ప్రస్తుతం అమెజాన్‌లో అందుబాటులో ఉంది.

# రంగయ్య అప్పారావుపేటలో భక్తిశ్రద్ధలతో శ్రీ దాసాంజనేయ స్వామి వారికి పానకాభిషేకం





**హనుమాన్ జంక్షన్,జూన్ 16 (వార్తాప్రభ) :** సమీపంలోని బాపులపాడు మండలం, రంగయ్య అప్పారావుపేట గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో క్షేత్రపాలకులు శ్రీ దాసాంజనేయ స్వామి వారికి జ్యేష్ఠ మాసం సందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో పానకాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సామవేదం అరుణ్ కుమార్ శర్మ వేద మంత్రోచ్చారణల నడుమ ముందుగా గణపతి పూజ, గోత్రనామాలతో సంకల్పం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం చేసి, శ్రీరామచంద్రమూర్తికి అత్యంత ప్రీతిపాత్రమైన పానకంతో స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించారు. తదనంతరం పుష్పాలు, నిమ్మకాయలతో ప్రత్యేక అర్చనలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ పుణ్యకార్యానికి కొల్లిపర వెంకటేశ్వరరావు – – శివ నాగేశ్వరి దంపతులు శ్రీ దాసాంజనేయ స్వామి వారికి నూతన వస్త్రాలను సమర్పించి తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. అలాగే దేవాలయంలో నిర్వహిస్తున్న "రామ జయ రామ జయ జయ రామ" ఏకనామ పారాయణం కార్యక్రమం ఆరవ రోజుకు చేరుకొని భక్తిపూర్వక వాతావరణంలో దిగ్విజయంగా కొనసాగింది. ఏడు రోజుల పాటు నిరంతరంగా శ్రీరామనామ స్మరణ చేయాలనే సంకల్పంతో మహిళా భక్తులు, గ్రామస్తులు విశేష ఉత్సాహంతో పాల్గొంటున్నారు. రామనామ స్మరణతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక చైతన్యంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో పరుచూరి రామకృష్ణ, దొడ్డపనేని సుశీల, కొల్లిపర రత్నమాణిక్యం, పరుచూరి వెంకటసుబ్బమ్మ, దొడ్డపనేని భారతీ లక్ష్మి, నల్లిబోయిన ఈశ్వరమ్మ, నల్లిబోయిన నాంచారమ్మ, లింగం పద్మజ్యోతి, మసిముక్కు లతా మంగేష్కరి, వీరమాచినేని కృష్ణకుమారి, కాట్రగడ్డ కృష్ణకుమారి, కొమ్మినేని విజయలక్ష్మి, సజ్జా రంగావర్ధిని, భూమా లీలమ్మ, లింగం దుర్గ, బోయపాటి విజయలక్ష్మి, తుమ్మల దమయంతి, మున్నంగి శివకుమారి, పొట్లూరి నాగమల్లేశ్వరి, పరుచూరి ధీరజ్, మసిముక్కు చాణిక్య, కొల్లిపర వరలక్ష్మి, కోటా సురేష్, యార్లగడ్డ నాగరతమ్మ, కొత్తపల్లి ప్రమీళ, తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. రేపటితో ఏడు రోజుల ఏకనామ పారాయణ మహోత్సవం ముగియనున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరామ నామస్మరణ ఫలితాన్ని పొందాలని వారు కోరారు.


# కామ్రేడ్ ఆశీర్వాదం కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన సీపీఐ నేతలు



**పెనుగంచిప్రోలు,జూన్ 16 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని, ముచ్చింతాల గ్రామం లో గత రెండు వారాల క్రితం సీపీఐ కార్యకర్త కోలకాని ఆశీర్వాదం (54) అన్నారోగ్యం మృతి చెందగా, ఆయన పెద్ద కర్మ రోజు సీపీఐ సీనియర్ నాయకులు వలం కొండ బ్రాహ్మం, జిల్లా రైతు సంఘ నాయకులు చుండూరు సుభారావు,సీపీఐ నాయకులు మాజీ ఎంపిపి పొన్నం నరసింహారావు,పద్మాల వెంకటేశ్వర రావు, సీపీఐ నాయకులు చల్లాల శివాజీ, కోలకాని అర్జున రావు, జక్కులూరి వెంకటేశ్వర్లు,కామ్రేడ్ ఆశీర్వాదం చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఆయన కుటుంబానికి సానుభూతి, సంతాపం తెలిపారు.అనంతరం ఆశీర్వాదం భార్య మేరమ్మ కు 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం కమ్యూనిస్టు పార్టీ నాయకులు ( సీపీఐ ) అందజేశారు...

# అనుమతులు లేని ఫ్లెక్సీలను తొలగించాలి

● తొలగింపునకు వారి నుండే రుసుము వసూలు చేయాలి ● కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ, జూన్ 16 (వార్తాప్రభ) :** జిల్లా కేంద్రం కాకినాడతో పాటు అన్ని మున్సిపాలిటీల్లో రోడ్ల డివైడర్లు, కూడళ్ళలో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తూ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల న్నిటినీ వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. పట్టణాల్లోని రోడ్ల మధ్య స్తంభాలపైన, రద్దీగా ఉండే కూడళ్ళలో స్థానిక సంస్థల నుండి ఎటువంటి అనుమతి లేకుండా అస్తవ్యస్తంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు వాహన చోదకులకు, పాదచారులకు పరిసరాలు కనబడకుండా అవరోధంగా నిలిచి ప్రమాదాలకు కారణమౌతున్నాయని, నిత్యం బాధిత ప్రజల నుండి వీటిపై ఫిర్యాదులు అందుతున్నాయని కలెక్టర్ తెలిపారు. పట్టణాలను అందవికారంగా చేస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న ఫ్లెక్సీలన్నిటినీ వెంటనే తొలగించి అందుకు అయిన ఖర్చును, అనుమతి లేకుండా ఫ్లెక్సీలను ప్రదర్శించినందుకు జరిమానాలను వాటిని ఏర్పాటు చేసిన వారి నుండి వసూలు చేయాలని మున్సిపల్ కమీషనర్లను కలెక్టర్ ఆదేశించారు. అనుమతులు లేకుండా తరచూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తూ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరేందిర ప్రసాద్ హెచ్చరించారు.

# ముక్త్ భారత్ అభియాన్ ఏఐ ఆధారత ఎక్సరే పరీక్షలు



**విస్సన్నపేట,జూన్ 16 (వార్తాప్రభ) :** స్థానిక మండలం కేంద్రంలో తెల్లదేవరపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విస్సన్నపేట సచివాలయం 4 లో పి ఎమ్ టి బి ముక్త భారతీయ ఏఐ ఆధారిత ఎక్సరే పరీక్షలు నిర్వహించారు. నిర్వహించడం జరిగినది. డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా టిబి వ్యాధి నిర్మూలించే లక్ష్యంతో ఆధునాతన స్క్రీనింగ్ ఏఐ ఆధారిత ఎక్స్రేలు మరియు మార్కులర్ టెస్టింగ్ సహాయంతో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. సంబంధిత పరీక్షల ఆధారంగా టీబిని మొదటి దశలో గుర్తించి నిర్మూలించడానికి సహాయపడుతుంది అని అందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. 101 మంది టెస్టులు నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. మెడికల్ మరియు సచివాలయం సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా షణ్ముఖరావు

● ఏకగ్రీవ తీర్మానం చేసిన సంఘ రాష్ట్ర నాయకులు శివ రాజేష్, వంశీకృష్ణ, జోగినాయుడు ● త్వరలోనే జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటన

● షణ్ముఖరావు ఎన్నికపై హర్షం వ్యక్తం చేసిన పలు జర్నలిస్ట్ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు



**శ్రీకాకుళం,జూన్ 16 (వార్తాప్రభ) :** పాత్రికేయ వృత్తే పరమావధిగా నిజాయితీగా సేవలందిస్తున్న సిక్కోలు టుడే దినపత్రిక ఎడిటర్ గజ్జి షణ్ముఖరావును ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్టు ఫోరం (ఏపీ ఎంఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవ తీర్మానం చేస్తూ రాష్ట్ర కార్యవర్గం మంగళవారం ఉత్తర్వులు వెలువరించింది. ఏపీ జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి శివ రాజేష్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ మారెళ్ళ వంశీకృష్ణ, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జి శాసన జోగినాయుడు ఈ తీర్మానానికి ఆమోదం తెలిపారు. గజ్జి షణ్ముఖరావు గతంలో అనేక ప్రధాన పత్రికల్లోనూ వివిధ స్థాయిల్లో సేవలు అందించారు. గతంలో జాప్ జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ పాత్రికేయుల సమస్యలపై, పాత్రికేయులు పై జరిగిన దాడులపై అనేక పోరాటాలు సాగించారు. ఈ సందర్భంగా నగరంలోని రెవెన్యూ అతిథి గృహంలో జరిగిన సమావేశంలో మంగళవారం జర్నలిస్ట్ జేఏసీ నాయకులు కాంక్యాన వేణుగోపాల్, శాసపు జోగినాయుడు, చింతపల్లి నాగ భూషణ్, గంజి ఆర్ ఎజ్రా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా షణ్ముఖరావుకు పూలమాల వేసి దుశాలువతో ఘనంగా సత్కరించారు. షణ్ముఖరావు మాట్లాడుతూ తన పట్ల ఎంతో నమ్మకంతో ఏపీ జె ఎఫ్ అందించిన ఈ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తించి పాత్రికేయుల సమస్యలపై పోరాడుతానని తెలిపారు. షణ్ముఖరావు ఎన్నిక పట్ల పలు జర్నలిస్టు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ అభినందన సభలో జర్నలిస్టులు సీపాన రమేష్ బాబు...బలగమోహన్, రౌతు సూర్యనారాయణ, టెంక శీను, గుజ్జల సూర్యనారాయణ, బొమ్మిడి వేణుగోపాల్, బి కృష్ణారావు, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రొయ్యల మేత ధరల పెంపుతో ఆక్వా రైతులపై పెను భారం

● అమలాపురం కలెక్టరేట్ ఎదుట భారీ ఆందోళన ● ధరల పెంపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ ● రైతుల సమస్యల పరిష్కారానికి శాశ్వత కమిటీ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



**అమలాపురం,జూన్ 16 (వార్తాప్రభ) :** రొయ్యల మేత ధరల అనూహ్య పెంపు ఆక్వా రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఇప్పటికే ఉత్పత్తి వ్యయాలు పెరిగి, అంతర్జాతీయ మార్కెట్‌లో రొయ్యల ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో నష్టాలను ఎదుర్కొంటున్న రైతులకు తాజాగా ఫీడ్ మిల్లర్లు కిలోకు ఏకంగా రూ.12 వరకు ధరలు పెంచడం మరింత భారంగా మారింది. ఈ నిర్ణయానికి నిరసనగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆక్వా రైతులు అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. రైతులు నినాదాలు చేస్తూ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రొయ్యల మేత ధరలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత నల్లవంతెన సమీపంలో నిరశన చేపట్టి, అక్కడినుండి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం వరకూ వెళ్లారు. అనంతరం జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించారు. ఆందోళనలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆక్వా రైతులు, ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధుల మధ్య పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ అవి ఇంకా కొలిక్కి రాకముందే ఫీడ్ మిల్లర్లు ఏకపక్షంగా ధరలను పెంచడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా అర్ధరాత్రి సమయంలో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ధరలను పెంచడం రైతులను మోసం చేసినట్లేనని విమర్శించారు. రొయ్యల సాగులో మొత్తం ఖర్చులో అత్యధిక భాగం మేతపైనే వెచ్చించాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఒక చెరువులో లక్షల రూపాయల పెట్టుబడితో సాగు చేసే రైతులకు కిలోకు రూ.12 పెంపు చిన్న విషయం కాదని, అది సీజన్ ముగిసే సమయానికి లక్షల రూపాయల అదనపు భారం అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే విద్యుత్, డీజిల్, కార్మిక వ్యయాలు, మందుల ఖర్చులు పెరిగిపోయాయని, ఇప్పుడు మేత ధరలు కూడా పెరగడంతో సాగు చేయడమే కష్టంగా మారిందన్నారు. రైతుల అభిప్రాయం ప్రకారం, ఫీడ్ తయారీ కంపెనీలు ముడి సరుకుల ధరల పెరుగుదలను సాకుగా చూపుతున్నప్పటికీ, ఆ పెంపు ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం శాస్త్రీయంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. పారదర్శకత లేకుండా తీసుకునే నిర్ణయాల వల్ల నష్టపోయేది రైతులేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రొయ్యల మేత ధరలను శాస్త్రీయంగా అంచనా వేసి, నియంత్రించేందుకు జీవో నెం.180 ద్వారా శాశ్వత రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఆక్వా రైతుల ప్రతినిధులు, ఫీడ్ తయారీదారులు, డీలర్లు, సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఎంపెడా), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్‌వాటర్ ఆక్వాకల్చర్ (సిబా), మత్స్యశాఖ అధికారులు సభ్యులుగా ఉండనున్నారు. ఈ కమిటీ ద్వారా మేత తయారీ వ్యయాలు, ముడి సరుకుల ధరలు, మార్కెట్ పరిస్థితులు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి పారదర్శకంగా ధరలను నిర్ణయించే అవకాశం ఏర్పడనుంది. రైతుల ప్రయోజనాలను కాపాడుతూ, ఫీడ్ కంపెనీల అవసరాలను కూడా సమతుల్యం చేసే విధంగా వ్యవస్థ పనిచేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే కమిటీ ఏర్పాటును రైతులు స్వాగతిస్తున్నప్పటికీ, ప్రస్తుతం అమల్లోకి వచ్చిన ధరల పెంపును వెంటనే నిలిపివేయాలని, కమిటీ నివేదిక వచ్చే వరకు పాత ధరలనే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల కష్టనష్టాలను అర్థం చేసుకుని ప్రభుత్వం మరింత వేగంగా స్పందించాలని కోరుతున్నారు. కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో లక్షలాది కుటుంబాలు ఆక్వా రంగంపై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో, మేత ధరల అంశం కేవలం రైతుల సమస్య మాత్రమే కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశమని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాశ్వత కమిటీ రైతులకు నిజమైన భరోసా కల్పించేలా పనిచేస్తుందా, ధరల నియంత్రణలో ఎంతవరకు ఫలితాలు సాధిస్తుందా అన్నది ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరి త్సవటపల్లి నాగభూషణం, కోనసీమ అక్వా ప్రెసిడెంట్ దెందుకూరి సత్తిబాబు రాజు, దాట్ల పృథ్వి రాజ్, అల్లూరి రమేష్ రాజు, యాళ్ల వెంకటనందం, కోనసీమ అక్వా కార్యదర్శి త్సవటపల్లి మాణికుమార్, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, కురసా కిట్టయ్య, రుద్రరాజు శ్రీనివాసరాజు, బాలరాజు, త్సవటపల్లి శ్రీను, మనే శ్రీను, ఇసుకపూడి వెంకటేశ్వర్లు, మమ్ము రాజు, తోలేటి నానాజీ, దుర్గ రాజు, గోకరకొండ శివ, కిరణ్ మొటూరి, నంద్యాల బాబి, త్సవటపల్లి హేమంత్, కాయల బలరాం, కూటికలపూడి శివ, నల్లా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం: -బీఆర్ఎస్ నేతల ధ్వజం

**-ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులకు చీమకుట్టినట్లైనా లేదులి**

**పారిశుధ్యం క్షీణించింది.. - ముందస్తు చర్యలు చేపట్టకుంటే భారీ ఆందోళనలు తప్పవు**



**కుత్బుల్లాపూర్, జూన్ 16, (వార్తాప్రభ)** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని జీడిమెట్ల 132 డివిజన్ భారత రాష్ట్ర సమితి సమన్వయ కమిటీ సభ్యులు (బీఆర్ఎస్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, గ్రామాలు, తండాలు మరియు బస్తీలలో నెలకొన్న భయానక తాగునీటి ఎద్దడిపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వేసవి కాలం ముగిసి వర్షాలు పడుతున్నా, ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ప్రజలు మంచినీటి కోసం గంటల తరబడి వీధుల్లో ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందని, మహిళలు, వృద్ధులు, చిన్నారులు నీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే తాగునీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా గాడితప్పిందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'మిషన్ భగీరథ' పథకం ద్వారా ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం పాలకుల అనాలోచిత నిర్ణయాలు, నిర్వహణ లోపాలు, నిర్లక్ష్యం మరియు సరైన ప్రణాళిక లేకపోవడం వల్లే నీటి సరఫరా తీవ్రంగా దెబ్బతిన్నదని పేర్కొన్నారు. అడ్డగోలు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని ప్రజలు ఇప్పటికే గుర్తించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమవ్వడం వల్ల ప్రభుత్వంపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. గత కొద్దిరోజుల క్రితం ఒక స్వతంత్ర సంస్థ నిర్వహించిన సర్వేలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కేవలం మూడవ స్థానం మాత్రమే కట్టబెట్టారని, ఈ ఫలితాలే ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు.

**క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఇవే:**
**అస్తవ్యస్త సరఫరా:** వారాల తరబడి తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. కాలనీల వారీగా నీటి సరఫరాకు ఎలాంటి సమర్థవంతమైన ప్రణాళిక కనిపించడం లేదు. ట్యాంకర్ల కొరత:లి ప్రభుత్వ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అవసరానికి చాలా తక్కువగా ఉంది. వీటి కోసం ప్రజలు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.
**నిర్లక్ష్యం:** పైపులైన్ల మరమ్మతులు, లీకేజీల నివారణ పనులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. సంబంధిత శాఖల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో, ప్రజలు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదు. క్షీణించిన పారిశుధ్యం:లి కాలనీల్లో చెత్తను సకాలంలో తొలగించకపోవడం, మురుగునీటి కాలువల (డ్రైనేజీల) శుభ్రత లేకపోవడం వల్ల దోమల వ్యాప్తి పెరిగి బస్తీ జనాలు రోగాల బారిన పడుతున్నారు.

**వర్షాకాలం ముంచుకొస్తున్నా ముందస్తు ప్రణాళిక శూన్యం**
మరికొద్ది రోజుల్లో వర్షాకాలం పూర్తిగా ముంచుకొస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోందని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. వర్షపు నీటి నిల్వలు, మురుగు నీటి ప్రవాహం, లోతట్టు ప్రాంతాల రక్షణ వంటి అంశాలపై సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల ప్రజలు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేవలం ప్రచారాలకే పరిమితమవుతున్న పాలకుల వైఖరిపై ప్రజలు నమ్మకం కోల్పోయారని, రానున్న రోజుల్లో వారే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు.
**బీఆర్ఎస్ పార్టీ డిమాండ్లు:** 1. అన్ని ప్రాంతాలకు నిరంతర మరియు క్రమబద్ధమైన తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలి. 2. నీటి ఇబ్బందులు ఉన్న కాలనీలకు అవసరమైన సంఖ్యలో అదనపు నీటి ట్యాంకర్లను ఉచితంగా ఏర్పాటు చేయాలి. 3. జలమండలి, మున్సిపల్ శాఖల్లో ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. 4. పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచి దోమల నివారణ చర్యలు చేపట్టాలి. 5. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని లోతట్టు ప్రాంతాల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలి. 6. ప్రజల ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికి ప్రత్యేక నియంత్రణ కేంద్రాలను (కంట్రోల్ రూమ్స్) ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజలను అండగా నిలబెట్టుకుని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల ముందు భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు, ముట్టడులు చేపడతామని వారు హెచ్చరించారు.

## నాలాలపై ఆక్రమణలు తొలగించి, అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులు పూర్తి చేయండి

**అధికారుల ఆదేశించిన ఎమ్మెల్యే గాంధీ**



**శేరిలింగంపల్లి,జూన్ 16 (వార్తాప్రభ):** మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువు,గంగారాం చెరువుల ఇన్‌లెట్లు, వాటర్ లాగింగ్ పాయింట్లను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఇన్‌లెట్లు కుంచించుకుపోవడం,చెత్త పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి మురుగు సమస్యలు తీవ్రతరం అవుతున్నాయని తెలిపారు. చెరువులకు వెళ్లే ఇన్‌లెట్లు,అవుట్‌లెట్లను శుభ్రపరచడంతో పాటు మ్యాన్‌హోల్స్‌లో పూడిక తొలగించి వరద నీరు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాలాలపై అక్రమ నిర్మాణాలను తొలగించి, అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాటర్ లాగింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ పరిశీలనలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సీఎంసీ కమిషనర్ సృజన, సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధులు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఘటనపై భగ్గుమన్న మహిళా లోకం!!

● నిందితుడు గౌస్‌ను ఉరితీయాలని భారీ ధర్నా ● మహిళలకు రక్షణ కల్పించాలని సురక్ష వేదిక డిమాండ్





**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**ఇటీవల ఖమ్మంలో జరిగిన బాలికపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ మంగళవారం రామగుండం కార్పొరేషన్ శాఖకు చెందిన మహిళా సురక్ష వేదిక ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక బాధ్యులు మాట్లాడుతూ, ఈ హృదయ విదారక ఘటనలో 12 ఏళ్ల బాలికపై మహమ్మద్ గౌస్ అనే నిందితుడు అత్యాచారం చేసి, తప్పించుకునే ప్రయత్నంలో భవనంపై నుండి తోసివేసినట్లు ఆరోపించారు. ఈ దారుణ చర్య యావత్ దేశాన్ని కలచివేసిందని, నిందితుడిని బహిరంగంగా ఉరితీయాలని లేదా ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో హిందూ మహిళలు, చిన్నపిల్లలపై మైనారిటీల రూపంలో జరుగుతున్న అకృత్యాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, లవ్ జిహాద్ పేరుతో హిందూ అమ్మాయిలను వేధించడం, అత్యాచారాలు చేయడం, కిడ్నాప్‌లు చేసి పెళ్లిళ్లు చేసుకోవడం వంటివి జరుగుతున్నాయని ఆరోపించారు. హిందూ సమాజం చైతన్యంతో సంఘటితమై ఇలాంటి ఘటనలను ఎదుర్కోవాలని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కార్పొరేషన్ అధికారి సతీష్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో లలిత, కోట తిరుమల, పైతరి శరణ్య భవాని, ఇందిర, వీణ, వందన, హరిణి, శ్రీజ, మునిగాల సంపత్, అడిగొప్పుల రాజు, పైతరి రాజు, సంపత్ యాదవ్, మ్యాడగోని రవీందర్, ఆరెల్లి జలంధర్, పొన్నం శశికుమార్ రాజకుమార్, పల్లికొండ ప్రశాంత్, సంజీవ్, గోటిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీ3 సింగరేణి అధికారులపై అసహనం!!

● డ్రాగ్‌లైన్ దొంగతనం వివాదంపై "శ్రీజా కంపెనీ" ఆరోపణలు ● ఎఫ్ఐఆర్‌లో రూ.1 లక్ష.. రికవరీ రూ.16 లక్షలు ● నిష్పక్షపాత విచారణ కోరిన బాధిత కాంట్రాక్టర్



**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**సింగరేణి ఆర్జీ త్రీ ఏరియాలో జరిగిన డ్రాగ్‌లైన్ స్క్రాప్ దొంగతనం కేసు ఇప్పుడు పెద్ద వివాదానికి దారితీస్తోంది. శ్రీజా ఇన్ఫ్రా సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్టర్ రవి కుమార్ మంగళవారం సెంటినరీ కాలనీలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జరిగిన మీడియా సమావేశంలో కన్నీటి గాధను వినిపిస్తూ, తనపై మోపిన రూ.16 లక్షల రికవరీ నిర్ణయం పూర్తిగా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఏప్రిల్ 15, 2026న ముగిసిన తర్వాత ఆరు రోజులకు జరిగిన ఘటనకు తాను బాధ్యుడిగా చూపించడం వెనుక కక్షపూరిత ధోరణి ఉందని ఆయన ఆరోపించారు. కాంట్రాక్ట్ ముగిసినట్లు ఏరియా సెక్యూరిటీ కార్యాలయం అధికారికంగా లేఖ జారీ చేసినప్పటికీ, ఏప్రిల్ 21, 2026న జరిగిన దొంగతనానికి తనను బలిపశువుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని బాధితుడు వేదనతో చెప్పారు. దొంగతనంలో పేర్లు వచ్చిన గార్డులు శ్రీజా ఇన్ఫ్రా సిబ్బంది కాదని, వారు గత ఆరు సంవత్సరాలుగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వారేనని స్పష్టంచేశారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో దొంగిలించబడిన స్క్రాప్ విలువ రూ.1 లక్షగా పేర్కొనగా, ఏరియా సెక్యూరిటీ అధికారులు ఎటువంటి విచారణ లేకుండా రూ.16 లక్షల రికవరీ విధించడం అనుమానాస్పదమని ఆయన వేదన వ్యక్తం చేశారు. సహజ న్యాయ సూత్రాలను పక్కన పెట్టి తన వివరణ తీసుకోకుండా, ముందస్తు నోటీసు ఇవ్వకుండా భారీ మొత్తాన్ని రికవరీ చేయడం వెనుక భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నమేనని ఆయన ఆరోపించారు. ఒక అమాయక కాంట్రాక్టర్‌ను బలిపశువుగా మార్చి, నిజమైన బాధ్యులను కాపాడే ప్రయత్నం జరుగుతోంది అని బాధితుడు కన్నీటి గళంతో మాట్లాడారు. తనపై విధించిన రికవరీ ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి, నిష్పక్షపాత విచారణ జరిపి న్యాయం చేయాలని సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులను వేడుకున్నారు.

# ఆధ్యాత్మిక తీర్థయాత్రా కేంద్రంగా ఓదెల!!

● ప్రభుత్వం చేసిన మహత్తర నిర్ణయం ● 15 కోట్లతో భవ్య పునరుద్ధరణ, సర్వాంగ సుందరం
● మాస్టర్ ప్లాన్ ఆవిష్కరణ, "విప్"కు వివరణ ● ఓదెల మల్లన్న క్షేత్రం ఇక మరో స్థాయిలోకి వెళ్తుంది
● విప్ విజయ రమణరావు





**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**తెలంగాణలోని పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం భారీ మేరకు నిధులు మంజూరు చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మొత్తం 15 కోట్ల రూపాయలు కేటాయించడం ఆధ్యాత్మిక వర్గాల్లో హర్షం కలిగించింది. ఇందులో ప్రభుత్వం నుంచి 10 కోట్లు, ఆలయ ప్రత్యేక నిధుల నుంచి 5 కోట్లు సమకూర్చబడగా, ఈ నిధుల సాయంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా, అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు ప్రముఖ స్థపతి వల్లినయాగన్ రూపొందించిన విశాల మాస్టర్ ప్లాన్‌ను హైదరాబాద్ బొగ్గులకుంటలోని ధార్మిక భవన్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో అధికారులు ఆవిష్కరించారు, ఈ మాస్టర్ ప్లాన్ వివరాలను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావుకి సంబంధిత అధికారులు వివరంగా వివరించి ఆలయ అభివృద్ధి దిశలో ముఖ్యమైన అడుగులు వేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఓదెల మల్లన్న క్షేత్రం తెలంగాణ రాష్ట్రంలో మరో ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రంగా భవిష్యత్తులో వెలుగొందుతుందని విప్, భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఆలయం సమగ్ర అభివృద్ధి చెందడం వల్ల భక్తుల సంఖ్య పెరిగి, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభించనుంది అని రమణరావు తెలిపారు. ఓదెల మల్లన్న క్షేత్రం ఇక మరో స్థాయిలోకి వెళ్తుంది అని సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ స్కూల్ లలో వివిధ సంస్థలతో మాట్లాడి అభివృద్ధి చేస్తాం.

**4 కోట్ల తో నిర్మిస్తున్న ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్ శంకుస్థాపనలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మరియు బిజెపి ఇన్చార్జ్ రవికుమార్ యాదవ్**





**శేరిలింగంపల్లి,జూన్ 16 (వార్తాప్రభ):**హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడా గ్రామ ప్రభుత్వ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను రూ.4 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పునర్నిర్మించేందుకు మంగళవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. వర్చ్సా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులకు చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి,బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి ఎం. రవికుమార్ యాదవ్, సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికులు పాఠశాలలో 10వ తరగతి వరకు తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. దీనిపై స్పందించిన నాయకులు సంబంధిత ప్రభుత్వ అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అధిక సంఖ్యలో పేద విద్యార్థులు చదువుతున్నారని,వారికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన వర్చ్సా ఫౌండేషన్,సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఇతర ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కూడా మరిన్ని కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ నిధులతో ముందుకు రావాలని కోరారు. పాఠశాలల అభివృద్ధి కోసం వివిధ సంస్థలతో చర్చలు జరిపి అవసరమైన సహకారం అందేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోయిని మహేష్ యాదవ్, ఫౌండేషన్ సభ్యులు కృష్ణ ఎద్దుల, వాసు, ఇందర్, పూజా, సుబ్బారావు, సురేష్‌బాబు, అరుణ, కేవీ, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జితేందర్, సురేష్ యాదవ్, కుమార్ యాదవ్, విజయేందర్, పద్మ, వినయ, బిందు, శ్రీనివాస్ యాదవ్, మనోజ్, ప్రసాద్ రెడ్డి, శ్రీశైలం కురుమ, పార్వతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## నిరుపేద విద్యార్థినికి ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సహకారం



**హైదరాబాద్, జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ట్రూ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సైఫాబాద్ ఎసిపి మోహన్ కుమార్ చేతుల మీదుగా కృష్ణానగర్ లోని నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని పృథ్వీ మునీ దివ్య శ్రీ విద్యా సహాయార్థం రూ.10,000/- రూపాయల చెక్కును అందజేయడం జరిగింది. ప్రస్తుతం ఆ విద్యార్థిని శ్రీ సాయి రామ్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ఆమె విద్యాభివృద్ధికి ఈ సహాయం ఉపయోగపడాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రూ హెల్పింగ్ హాండ్స్ వైస్ ప్రెసిడెంట్ గొగికార్ రోహిత్ , జాయింట్ సెక్రటరీ బైకని శ్రీశైలం యాదవ్ మరియు మనోహర్ పాల్గొన్నారు. "విద్యే సమాజ అభివృద్ధికి పునాది." ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి కూడా తన చదువుకు దూరం కాకూడదనే సంకల్పంతో మా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయని ట్రూ హెల్పింగ్ సంస్థ సభ్యులు తెలిపారు

## ఎస్సీ రాష్ట్ర వైస్ చైర్మన్ గా ఎన్నికైన గడ్డం శ్రీనివాస్ కు

**శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు మంత్రులు,ఎమ్మెల్యేలు..**



**జవహర్ నగర్, జూన్ 16:(వార్తా ప్రభ)**కీసర సర్కిల్ జవహర్ నగర్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన డాక్టర్ గడ్డం శ్రీనివాస్ ను పలువురు మంత్రులు,ఎంపీలు,ఎమ్మెల్యేలు మరియు ఏఐసీసీ నాయకులు ఘనంగా సన్మానించి,శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి నాయకత్వం నుండి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ,పార్టీ కష్టకాలంలో సైతం అంకితభావంతో సేవలందించి,పార్టీ అధికారంలోకి రావడానికి నిరంతరం శ్రమించిన ఫలితంగా ఈ కీలక పదవి దక్కిందని నాయకులు అభినందించారు . ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి,పంచాయతీరాజ్ మరియు స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్క,మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ,రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ ఏఐసీసీ సీనియర్ నాయకులు శ్రీ మధు యాష్కీ గౌడ్,తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క,సతీమణి శ్రీమతి నందిని విక్రమార్క గడాక్టర్ గడ్డం శ్రీనివాస్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఉన్నత పదవులను అధిరోహించి ప్రజలకు,పార్టీకి విశిష్ట సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పెద్దల విశ్వాసాన్ని నిబెట్టూకుంటూ,ఎస్సీల ఆర్థిక అభివృద్ధికి,ఉపాధి అవకాశాల కల్పనకు పాటుపడుతానని తన విదేయతను చాటుకున్నారు. అదేవిధంగా రాజకీయ,ఆర్థిక,సామాజిక,సాంఘీకంగా వెనుబడిన ఎస్సీలు ఆత్మగౌరవంతో జీవించేలా చేసి,కాంగ్రెస్ పెద్దల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు,ఫలాలు ప్రతిఒక్కరికి చేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమం,వారి ప్రయోజనాలకు చేపడుతున్న అన్నిరకాల అభివృద్ధి ఫలాలు చేరువచేసి,ప్రభుత్వంపై ఎస్సీల విశ్వాసాన్ని తను పెంచేలా శ్రమిస్తానని డాక్టర్ గడ్డం శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే కసిరెడ్డి .




**ఎల్బీనగర్/ వార్తప్రభ ( జూన్ 16):**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జూన్ 16న నిర్వహించిన "మీ ఎమ్మెల్యేగారికి నేరుగా ఫోన్ చేసే" కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఉదయం 10 నుండి 11 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు తాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాలు వంటి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రజల వినతులను శ్రద్ధగా ఆలకించిన ఎమ్మెల్యే.. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సమస్యల త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పరిపాలనను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం విజయవంతమైంది.

## నేడు కూటమి ప్రభుత్వ ఎన్టీఆర్ జిల్లా స్థాయి విజయోత్సవ సభ




**ఇబ్రహీంపట్నం, జూన్ 16 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఎన్డీయే కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటుపల్లి సీఏ కన్వెన్షన్ లో ఎన్టీఆర్ జిల్లా స్థాయి విజయోత్సవ సభను ఈ నెల 17న నిర్వహించనున్నట్లు మైలవరం ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ విజయోత్సవ సభకు మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆతిథ్యమిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# సంపాదకీయం

## రాజ్యసభలో ఎన్‌డీఏ 'సూపర్ పవర్'.. లోక్‌సభ సంగతేంటి?

కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం పట్టుబిగిస్తోంది. ఈ నెలలో 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న ప్రభుత్వం రాజ్యసభలో సూపర్ పవర్ గా నిలిచింది. ఈ 12 ఏళ్లలో రాజ్యసభలో ప్రతిపక్షాలదే హవా ఉండగా, క్రమంగా తమ పార్టీ సభ్యులను పెంచుకుంటూ వచ్చిన బీజేపీ ఇప్పుడు పెద్దల సభలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. అంతేకాకుండా కీలక బిల్లుల ఆమోదానికి అవసరమైన 2/3వ వంతు మెజార్టీకి చేరువ అయింది. తాజాగా జరిగిన రాజ్యసభ ఎన్నికలతో పెద్దల సభలో బీజేపీతోపాటు ఎన్డీఏ బలం ప్రస్తుతం 163కి చేరింది. అంటే కీలక బిల్లుల సవరణ విషయంలో అవసరమైన 172 సంఖ్యకు కేవలం 9 స్థానాల దూరంలోనే ఉందని అంటున్నారు. జాతీయ స్థాయిలో చోటుచేసుకుంటున్న పరిణామాలతో ఎన్డీఏ ప్రభుత్వం రాజకీయంగా అజేయశక్తిగా మారుతోందని అంటున్నారు. ప్రధానంగా దేశంలోని మెజార్టీ రాష్ట్రాల్లో సొంత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన బీజేపీ.. అదే సమయంలో ప్రతిపక్షాలను ఛిన్నాభిన్నం చేయడంపై ఫోకస్ చేసిందని అంటున్నారు. దీనికి ఇటీవల రాజకీయాలను ఉదహరిస్తున్నారు. బెంగాల్ లో టీఎంసీ సంక్షోభం, పంజాబ్, ఢిల్లీలో ఆప్ ఎంపీల తిరుగుబాటు బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏకి లాభం చేకూరుస్తోందని అంటున్నారు. ఇక రాజ్యసభలో ఎన్డీఏ తిరుగులేని మెజార్టీ సాధించడంతో కీలకమైన బిల్లుల ఆమోదంలో ప్రభుత్వం మరింత దూకుడు చూపే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. మరోవైపు పెద్దల సభలో చక్రం తిప్పుతున్న ఎన్‌డీఏకి లోక్‌సభలో మాత్రం 2/3 మెజారిటీ సాధించడం ఇంకా సవాల్ గానే ఉందని అంటున్నారు. అక్కడ రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదం కోసం 363 స్థానాలు అవసరం కాగా, ప్రస్తుతం ఎన్‌డీఏ పార్టీల చేతిలో 314 స్థానాలు మాత్రమే ఉన్నాయి. అంటే ఇంకా 49 స్థానాలు తక్కువగా ఉన్నాయి. చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ, నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ వంటి కీలక మిత్రపక్షాల మద్దతుతోనే ఎన్‌డీఏ ఇక్కడ ప్రభుత్వం నడుపుతోంది. బలమైన ప్రతిపక్షం ఉండటంతో లోక్‌సభలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ఎన్‌డీఏకి సాధ్యం కావడం లేదంటున్నారు. దీంతో లోక్ సభలోనూ 2/3 వంతు మెజార్టీ సాధనకు బీజేపీ పెద్దలు ప్రణాళికలు రచిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుతం టీఎంసీ తిరుగుబాటు ఎంపీలు 20 మంది ఎన్డీఏతో చేతులు కలిపేందుకు సిద్ధమవుతుండటం, తమిళనాడులో ఇండి కూటమి నుంచి డీఎంకే బయటకు రావడంతో దిగువ సభలోనూ 2/3 వంతు మెజార్టీ సాధించడం పెద్ద కష్టమేమీ కాదని కమలనాథులు భావిస్తున్నారని అంటున్నారు. ఈ పరిణామాలతో ఎన్‌డీఏ ఎజెండాలో ఉన్న రెండు ప్రతిష్టాత్మకమైన బిల్లులు ఆమోదానికి మార్గం సగమయ్యే సూచనలు కనిపిస్తున్నాయని అంటున్నారు. ప్రధానంగా 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్' బిల్లుతోపాటు మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులను తాము అనుకున్న విధంగా ఆమోదింపజేసుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఈ రెండు బిల్లులకు పార్లమెంటు ఆమోదముద్ర లభిస్తే దేశవ్యాప్తంగా లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంతోపాటు జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను పెంచే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మొత్తానికి పెద్దల సభలో ఎన్డీఏ సాధించిన మెజార్టీ భవిష్యత్తు రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

## ఒత్తిడిని జయించి.. కార్యదక్షతను పెంచి..

## - మీడియా వృత్తిలో సమతుల్యతకు యోగానే మార్గం

ఆరోగ్యవంతమైన మీడియా సమాజానికి నిత్య యోగా దివ్య ఔషధం

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ పశ్చిమ జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రస్తుత వేగవంతమైన మీడియా రంగంలో పనిచేస్తున్న పాత్రికేయులు, ఫొటోగ్రాఫర్లు, ఇతర మీడియా ప్రతినిధులు నిరంతరం ఒత్తిడితో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని.. ఇలాంటి పరిస్థితిలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి యోగా సాధన ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు.యోగాంధ్ర–2026లో భాగంగా మంగళవారం హరిత బెరం పార్కులో జరిగిన మీడియా థీమ్ యోగా కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే సమగ్ర జీవన విధానమని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని సూచించారు. మీడియా ప్రతినిధులు నిరంతరం ఒత్తిడి, సమయపాలన, క్షేత్రస్థాయి విధుల కారణంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటారని, అలాంటి పరిస్థితుల్లో యోగా వారికి శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందించడంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యోగా ద్వారా ఒత్తిడిని అధిగమించి పనితీరును మరింత మెరుగుపరచుకోవచ్చని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రత్యేక కార్యక్రమాలను కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని.. ఇదేవిధంగా యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేసి ప్రజలను యోగా సాధన వైపు మరింతగా ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆర్టిస్టిక్ యోగా కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.జయరాజు, ఉపాధ్యక్షులు చావారవి, సీనియర్ పాత్రికేయులు ఎం.గాంధీబాబు, వైవీవీ వరప్రసాద్, సీహెచ్ విజయభాస్కర్, సీహెచ్ నారాయణరావు, డీవీ రమణ, వైడీ ఆనంద్, సోషల్ మీడియా ప్రతినిధులు కిరణ్, నంద, మహేష్ తదితరులతో పాటు డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, జిల్లా ఆయుష్ అధికారి డా.వై.రత్నప్రియదర్శిని, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి బి.ప్రభాకరరావు, యువజన సంక్షేమ అధికారి డా. కొల్లేటి రమేష్, డీఎస్‌డీవో కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నగర పరిశుభ్రతకు ప్రాధాన్యం - పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ పశ్చిమ జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం మహాత్మా గాంధీ రోడ్, లోబ్రిడ్జి, బీఆర్‌టీఎస్ రోడ్డు, కృష్ణవేణి క్లాత్ మార్కెట్, నైజాం గేట్, గాంధీ హిల్ ప్రాంతాలలో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, వ్యర్థాల తొలగింపు, కాలువల శుభ్రత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా పంజా సెంటర్ సమీపంలోని కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులను పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ సజావుగా పనిచేసేలా పూడిక తొలగింపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పూడిక తొలగింపునకు వినియోగిస్తున్న యంత్రాల పనితీరును కూడా పరిశీలించారు.అనంతరం నైజాం గేట్ ప్రాంతంలో కాలువల్లో తేలియాడుతున్న వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, వ్యర్థాల తొలగింపు చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.నగరంలోని ప్రధాన కాలువలు, డ్రైన్లు, ప్రజా ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్త సేకరణ, వ్యర్థాల తొలగింపు, కాలువల శుభ్రత కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగించాలని కమిషనర్ ఆదేశించారు. నగర ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.తదుపరి గాంధీనగర్‌లోని గాంధీజీ మహిళా కళాశాల సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ ధ్యానచంద్ర క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహార నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ, వంటశాల పరిశుభ్రత, తాగునీటి సరఫరా తదితర అంశాలను స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.అన్న క్యాంటీన్‌కు వచ్చే లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే క్యాంటీన్ నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, ప్రజలు ఎదుర్కొనే ఏవైనా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె. శ్రీనివాస్, గోపాల కృష్ణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ సిబ్బంది పాల్గొన్నారు.

# సెక్యూరిటీ సిబ్బంది భక్తులు పట్ల గౌరవం గా మెలగాలి



**విజయవాడ పశ్చిమ జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇంద్రకీలాద్రి పుణ్యక్షేత్రంలో ప్రతి చోట భక్తులను గౌరవించి,మర్యాదతో ఆప్యాయత చూపిస్తే అటు ప్రభుత్వంకి ఇటు దేవస్థానంకి మంచి పేరు వస్తుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి. కె. శీనానాయక్ అన్నారు. మంగళవారం ఉదయం మహామండపం 4వ అంతస్తులో దేవస్థానం సెక్యూరిటీ సిబ్బందితో సమావేశం అయి మాట్లాడారు.ఆలయ వ్యవస్థలో కీలకమైన సెక్యూరిటీ విభాగం పనితీరు మెరుగుపడాలని, జవాబుదారీ తనం లేకుండా విధులు యాంత్రికంగా చేస్తే ఫలితం లేదని పేర్కొన్నారు.ఆలయ వ్యవస్థలో క్రింద నుండి ఈవో వరకు అందరికి సమిష్టి బాధ్యత ఉందని, అన్ని స్థాయిల్లో దాదాపు 1000 మంది సిబ్బంది ఉన్న ఈ ఆలయంలో భక్తులతో ఎలా ప్రవర్తిస్తున్నామో, ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఈవో వెల్లడించారు.ఎన్నో బాధలు, ఇబ్బందులతో వచ్చే భక్తులుతో మర్యాదగా,గౌరవంగా మాట్లాడి దర్శనం, ప్రసాదం అందేలా చేస్తే వాళ్ళే గొప్పగా చెబుతారని, భక్తులు సంతోషంగా వెళ్లి పది మందికి చెబుతారని పేర్కొన్నారు.కొంతమంది సెక్యూరిటీ సిబ్బంది వైఫల్యం వలన దేవస్థానం మొత్తానికి చెడ్డ పేరు వస్తే ప్రభుత్వం సహించే స్థితిలో లేదని, సెక్యూరిటీ సిబ్బందికి పనిలో ఏవైనా అడ్డంకులు, బెదిరింపులు వస్తే తన దృష్టికి తీసుకురావాలని, నిబంధనలు ప్రకారం ప్రతీ సెక్యూరిటీ ఉద్యోగి అన్ని పాయింట్లలో పని చేసేలా తర్ఫీదు ఇవ్వాలని, అందరికి సమానంగా విధులు కేటాయించాలని శీనానాయక్ ఆదేశించారు.పార్కింగ్, లిఫ్ట్, ప్రోటోకాల్, అన్న ప్రసాదం, ఆన్ లైన్ సేవలు తదితర ప్రదేశాలలో పని చేసే సిబ్బంది అప్రమత్తంగా, క్రమశిక్షణతో పని చేయాలని ఈవో పేర్కొన్నారు.

# తలపనేని జయంతులు నాయుడు తో నాకు ప్రాణహాని ఉంది

- వ్యవస్థలను చేతిలోకి తీసుకుని బెదిరింపు దోరణలతో అరాచకం
- సర్వేయర్ , తహాశీల్దారుకు ఫిర్యాదు చేయాలి కానీ ఇలా బెదిరించడం చట్ట వ్యతిరేకం..
- చేజర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన బాధితుడు గట్టుపల్లి జయరామ నాయుడు





**చేజర్ల జూన్ 16 (వార్తాప్రభ)** చేజర్ల మండలంలోని పెరుమాళ్ళ పాడు గ్రామంలో గట్టుపల్లి జయరామ నాయుడుని నిన్ను చంపేస్తాను నా కొడకా అంటూ తలపనేని జయంతులు బెదిరించడం జరిగిందని బాధితుడు గట్టుపల్లి జయరామ నాయుడు చేజర్ల పోలీస్ స్టేషన్లో మంగళవారం ఉదయం 10 గంటలకు ఫిర్యాదు చేయడం జరిగినది.వివరాల్లోకి వెళితే. జయరామ నాయుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం జయరామ నాయుడు కి పెరుమాళ్ళ పాడు గ్రామ సర్వే నంబర్ 59–1 లో 4 ఎకరాలు 77 సెంట్లు పొలం కలదు. సదరు పొలంలో కొంత భాగం వేరుశనగ పంట వేయడం జరిగిందని మిగతా స్థలంలో చెట్లు ఉండడంతో ఆ చెట్లు కొట్టివేసి మొత్తం చదును చేసే క్రమంలో మంగళవారం ఉదయం కొంతమంది కూలీలను పిలిచి చెట్లు కొట్టి వేస్తూ ఉండగా అదే గ్రామానికి చెందిన తలపనేని జయంతులు నాయుడు అనే వ్యక్తి నా పొలం దగ్గరకు వచ్చి చెట్లు కొడుతున్న కూలీలను బెదిరించి దౌర్జన్యం చేసి వాళ్ళని నానా తిట్లు తిట్టి నా పైకి చంపడానికి వచ్చాడు.నా పొలంలో నేను చెట్లు తీసివేసి చదును చేస్తుంటే మీరు వచ్చి బెదిరించడం సరైనది కాదని ఎంత బ్రతిమిలాడినా నిన్ను చంపేస్తా ఇక్కడ నీకు పొలం లేదు నిన్ను అసలు బ్రతకనివ్వను అంటూ నన్ను భయాందోళనకు గురిచేసి మీద మీదకు వచ్చి చంపడానికి ప్రయత్నించాడు. ఆయనతో పాటు తలపనేని పెంచలయ్య ,చంద్ర వెంకటరత్నం, కారుమంచి ప్రసాద్ ,షేక్ ఖాజావలి గ్రామానికి చెందిన మరి కొంతమంది వ్యక్తులు అక్రమంగా నా పొలంలోకి ప్రవేశించి నా మీద దాడి చేయడానికి ప్రయత్నించారు. కూలీలను బెదిరించి మిమ్మల్ని అందరిని చంపేస్తాము అంటూ బెదిరించసాగారు.నీకు ఇక్కడ పొలం లేదు నా కొడకా నిన్ను చంపేస్తామంటూ బూతులతో రెచ్చిపోయి బెదిరించారు.సదరు తలపనేని జయంతులు నాయుడు వలన నాకు ప్రాణహాని ఉందని గట్టుపల్లి జయరామ నాయుడు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదు చేయడం జరిగినది.

# ఇంద్రకీలాద్రిపై సామూహిక అక్షరాభ్యాసాలకు - సర్వం సిద్ధం

ఉదయం 6 గంటలకే మహా మండపం 6వ అంతస్తుకు చేరుకోవాలి

ఆలయ ఈవో వీకే శీనా నాయక్

**విజయవాడ పశ్చిమ జూన్ 16:(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో బుధవారం ( నేడు జూన్ 17వ తేదీన) నిర్వహించబోయే 'ఉచిత సామూహిక అక్షరాభ్యాస' మహోత్సవానికి దేవస్థానం అధికారులు సర్వసిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, నిబంధనలను ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

**ముఖ్యమైన సూచనలుడ నిబంధనలు:**250 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం: ఈ ఉచిత సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం కోసం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా 250 మంది చిన్నారుల తల్లిదండ్రులు తమ పేర్లను నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకున్నారు.రిపోర్టింగ్ సమయం: ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న భక్తులు రేపు ఉదయం 6:00 గంటలకే ఇంద్రకీలాద్రిపై ఉన్న మహా మండపం 6వ అంతస్తుకు చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడ అధికారులకు తమ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పత్రాలను చూపించవలసి ఉంటుంది. అక్షరాభ్యాసం చేసుకునే చిన్నారితో పాటు కేవలం వారి తల్లిదండ్రులకు మాత్రమే మహా మండపం 6వ అంతస్తులోకి ప్రవేశం కల్పిస్తారు. ఇతరులకు అనుమతి ఉండదు.ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరి: ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి ఈ సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఎలాంటి ప్రవేశం లేదు.

**ఉదయం 8:06 గంటలకు శుభ ముహూర్తం:**

వేద పండితులు ఈ అక్షరాభ్యాస మహోత్సవానికి ఉదయం 8 గంటల 06 నిమిషాలకు శుభ ముహూర్తంగా నిర్ణయించారు. ఈ నిర్ణీత ముహూర్తానికే పండితుల మంత్రోచ్ఛారణల మధ్య చిన్నారులతో అక్షరాభ్యాసం జరుగుతుంది.

**ఉచితంగా పూజా సామాగ్రి - అమ్మవారి దర్శనం:**అక్షరాభ్యాసం చేసుకునే చిన్నారులందరికీ అవసరమైన పలక, బలపం మరియు పూజా సామాగ్రిని దేవస్థానం తరఫున ఉచితంగా అందజేయడం జరుగుతుంది.ఈ పవిత్ర కార్యక్రమం విజయవంతంగా ముగిసిన అనంతరం, అక్షరాభ్యాసం పొందిన చిన్నారులకు మరియు వారి తల్లిదండ్రులకు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేసేందుకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న భక్తులందరూ పైన పేర్కొన్న సమయ పాలనను పాటించి, దేవస్థాన సిబ్బందికి సహకరించి, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈవో శీనా నాయక్ కోరారు.



# కొనకంచి, తోటచర్ల గ్రామాల్లో స్వచ్ఛ రధం.....

**పెనుగంచిప్రోలు, జూన్ 16( వార్త ప్రభ )** షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛ రథం పెనుగంచిప్రోలు మండలం లోని కొనకంచి ,తోటచర్ల గ్రామాలలో మంగళవారం తిరుగుతుంది, పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు,పాత ఇనుము, పాతపుస్తకాలు, అట్టలు, స్వచ్ఛరథం ఆపరేటర్ కు ఇచ్చి వాటి విలువకు సరిపడా నిత్యవసర వస్తువులు తీసుకోవచ్చును, దీనివలన గ్రామం చెత్త రహిత గ్రామంగా ఉండి పరిశుభ్రంగా ఉంటుందని మండలపరిషత్ అభివృద్ధి అధికారి శ్రీమతి శ్రీను తెలియజేసినారు..

# 18న ఐఎంఎలో వైద్యులకు ప్రమాదకర అంటువ్యాధుల నిరోధంపై అవగాహన సదస్సు

**గుంటూరు టౌన్ జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ప్రైవేట్ ఆరోగ్య సదుపాయాల సమాచారం, ప్రమాదకర అంటువ్యాధుల నిరోధంపై ప్రైవేటు వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ టి .సేవ కుమార్ ,డాక్టర్ బి. సాయికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ గురువారం సాయంత్రం జిఎంఎ హాల్లో నిర్వహించే ఈ అవగాహన సదస్సులో జిల్లా వైద్య ఆరోగ్యశాధికారి డాక్టర్ కె. విజయలక్ష్మి ,ఏపీఎంసీ చైర్మన్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్ , ఏపీడీమియాలజిస్ట్ డాక్టర్ చంద్రకాంత్ మోర్గే ,ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి. వరప్రసాద్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సోహైల్ అహ్మద్, వై చంద్రశేఖర్ తదితరులు పాల్గొంటారన్నారు. నగరంలోని వైద్యులందరూ తప్పనిసరిగా ఈ సదస్సు కు హాజరుకావాలని ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు ఆ ప్రకటనలో కోరారు .

# విద్యారంగానికి లారీ ఓనర్ల ఫెడరేషన్ సహకారం ప్రశంసనీయం

ప్రముఖ సామాజికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్




**విజయవాడ పశ్చిమ జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విద్యారంగానికి లారీ ఓనర్ల ఫెడరేషన్ అందజేస్తున్న సహకారం ప్రశంసనీయమని ప్రముఖ సామాజికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ అన్నారు. విద్యారంగ రంగానికి అందజేసే సహకారం భవిష్యత్తు తరాలకు ఎంతో తోడ్పాటు అందిస్తుందని కొనియాడారు. ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు అండగా నిలిచేందుకు లారీ ఓనర్ల ఫెడరేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా, ఈ ఏడాది కూడా నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస కుమార్ ప్రతిపాదించిన శ్రీ విద్యాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ మరియు నెహ్రూ బొమ్మ సెంటర్ లోని భారతీ విద్యా నికేతన్ పాఠశాలలకు చెందిన 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులకు నోట్ బుక్స్‌ను అందజేశారు.ఈ కార్యక్రమానికి ఆకుల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఫెడరేషన్ సభ్యులు పర్వతనేని ప్రసాద రావు, గోపాల రావు, సుబ్రహ్మణ్యం, కృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ సభ్యులు ఆకుల శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ హితం కోసం పాటుపడుతున్న ప్రసాద రావు, సాంబశివరావు లను ప్రత్యేకంగా అభినందిస్తూ వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అల్లం పూర్ణ, నూకల వాసు, ఆలమూరి సాంబ, సింగవరపు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# కుండల బజార్ డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా..

విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి...



**విజయవాడ పశ్చిమ జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భవానిపురం , క్రాంబ్వే రోడ్డు లోని కుండల బజార్ డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు.. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి ప్రల్హాద్ జోషి తో కలిసి వాజ్ పేయి పార్క్ కు విచ్చేసిన ఎమ్మెల్యే సుజనాను కుండల బజార్ కాలనీవాసులు, మహిళలు కలిసి వినతి పత్రం అందజేశారు..ఈ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక కొద్దిపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని అనేక అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే సుజనాకు వివరించారు..కుండల బజార్ డ్రైనేజీ వ్యవస్థ పరిష్కారానికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే సుజనా తెలిపారు..వీఎంసి ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి అంచనా రూపొందించామన్నారు.అతి త్వరలోనే డ్రైనేజీ పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని ఎమ్మెల్యే సుజనా హామీ ఇచ్చారు.. పశ్చిమ నియోజకవర్గంలో భవిష్యత్తులో ఎలాంటి మురుగు సమస్యలు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడతామని ఎమ్మెల్యే సుజనా తెలిపారు...

# మామయ్యా సందేశం

అవసరం తీరిందని
అయినవాళ్ళను మరువకు
గౌరవం పెరిగిందని
అహంకారం చూపకు
కష్టాలు వచ్చాయని
నష్టాలు తెచ్చాయని
తలబాదుకుని ఏడ్వకు
మనోనిబ్బరం వీడకు
అపజయం వచ్చిందని
నిరాశ లోయలో ఉండకు
విజయం వరించిందని
గాలిలో తేలియాడకు
స్థిత ప్రజ్ఞత చూపించాలి
పరిణితితో మసలాలి
స్ఫూర్తిని పంచిపెట్టాలి



కీర్తిని సంపాదించాలి

-గద్వాల సోమన్న,

ఎమ్మిగనూరు,

సెల్ :9966414580

# వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్.

● మోడీ నాయకత్వంలో సమగ్ర అభివృద్ధి.● అమరావతి అభివృద్ధికి కేంద్రం పూర్తి మద్దతు ● కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ● స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి.. ● వాజపేయి పార్క్‌లో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు... ● వాజ్ పైయ్ విగ్రహానికి ఘన నివాళులు.





**విజయవాడ పశ్చిమ జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. విజయవాడ భవానిపురంలోని వాజపేయి పార్క్ వద్ద నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి తదితరులు పాల్గొన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఎమ్మెల్యే సుజనా చౌదరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. అనంతరం మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్క్‌లో స్థానిక వాకర్లతో కలిసి నడుస్తూ వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ నరేంద్ర మోదీ దేశ చరిత్రలో అత్యధిక కాలం సేవలందించిన ప్రధానమంత్రులలో ఒకరిగా నిలిచారని పేర్కొన్నారు. 2014కు ముందు పదేళ్ల పాటు దేశ ఆర్థిక వ్యవస్థ క్షీణ పరిస్థితుల్లో ఉండేదని, ప్రస్తుతం ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందన్నారు. రైల్వే రంగంలో భారత్ విశేష ప్రగతి సాధించిందని, ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో రైల్వే విద్యుదీకరణ పూర్తి చేసిన దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉందని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ ఎనిమిది రెట్లు పెరిగిందని, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ద్వారా దేశీయ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా విస్తరించిందన్నారు. అమరావతి రాజధాని అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తదితర నాయకులు ప్రధాని మోదీకి సమగ్ర వివరాలు అందించారని చెప్పారు. అమరావతి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్ల సహాయం అందించగా, హడ్కో ద్వారా మరో రూ.11 వేల కోట్ల నిధులు సమకూర్చినట్లు వెల్లడించారు. అమరావతిని దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించే ప్రత్యేక రైల్వే లైన్ కోసం కూడా నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేసిన ప్రహ్లాద్ జోషి, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, పీవీఎన్ మాధవ్ సమన్వయంతో సమర్థవంతంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇదే అభివృద్ధి నమూనాను తెలంగాణలో కూడా అమలు చేస్తూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రగతికి కేంద్రం సహకరిస్తోందని చెప్పారు. అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, ఉపాధి అవకాశాల కల్పన ద్వారా వికసిత భారత్ లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు.

## కనకదుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి..

ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీ వీ ఎన్ మాధవ్, ఎమ్మెల్యే సుజనా చౌదరి
ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందిన కేంద్రమంత్రి..
స్వాగతం పలికిన ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ గాంధీ, ఈవో శీనా నాయక్





**విజయవాడ పశ్చిమ జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రలహాద్ జోషి మంగళవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి వెంట విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ చౌదరి, ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీన్ మాధవ్ , బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డురి శ్రీరామ్ , తదితరులు ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు.దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ గాంధీ , కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ కేంద్రమంత్రికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేయగా అమ్మవారికి కేంద్రమంత్రి ప్రత్యేక పూజలను నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి వేదాశీర్వచనం అందించగా దుర్గగుడి ఛైర్మన్ బోర్ర రాధాకృష్ణ ఈవో శీనా నాయక్ లు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు అవ్వారు బుల్లబ్బాయి శ్రీనివాసరావు రావు, రాఘవ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతి



**ఆత్మకూరు జూన్ 16 (వార్తాప్రభ)** మర్రిపాడు లోనిచుంచులూరు ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 500 పైగా మార్కులు సాధించిన నాగరాజు పల్లి విక్రాంత్ కలువాయి సునీత వల్లెపు నరేష్ లకు పాఠశాల పూర్వ విద్యార్థి విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి పాపుదిప్పు రమణారెడ్డి ఒక్కొక్కరికి ఇరవై వేలు వంతున మొత్తం అరవై వేల రూపాయలు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో 500 పైన మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి 20000 రూపాయల వంతున నగదు ప్రోత్సహకాలు అందజేయడం అభినందనీయమని విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసి వారిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు ఇలాంటి ప్రోత్సాహకాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.పాఠశాల పూర్వ విద్యార్థిగా రమణారెడ్డి పాఠశాల పట్ల చూపుతున్న అభిమానం విద్యార్థుల భవిష్యత్తు పట్ల తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని కొనియాడారు.దాత రమణారెడ్డి మాట్లాడుతూ విద్య జీవితానికి బలమైన పునాది అని విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. భవిష్యత్తులో కూడా 500 పైన మార్కులు వచ్చిన విద్యార్థులందరికీ ఒక్కొక్కరికీ ఇరవై వేలు వంతున ప్రోత్సాక నగదు బహుమతి అందజేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గంగపాలెం ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ రాజుపాలెం ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి ఉపాధ్యాయులు డి.వి.రమణయ్య పెంచలరావు బాలాజీ మల్లికార్జున స్వామి తిరుపాలు రహీమ ప్రసాద్ రాఘవేంద్ర కలిశెట్టి రాజేంద్ర కుమార్ యలగాల శ్రీనివాసులు గ్రామానికి చెందిన నాగరాజుపల్లి రాజా కాకే సుబ్బారెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ తో ఉపాధి.



**మచిలీపట్నం జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలోని చదువుకున్న నిరుద్యోగ ఎస్. సి. యువతీ యువకులకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి మేళాలు నిర్వహించేందుకు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో కేంద్ర ప్రభుత్వ పథకం పీ.ఎం.అజయ్ పథకం అమలుపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగ ఎస్.సి. యువతీ యువకులకు నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉపాధి మేళాలు నిర్వహించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎం అజయ్) పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో బహుళ రంగాల జీవనోపాధి కల్పించు ప్రదర్శనలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మేళాలు భవిష్యత్తు వృత్తిపరమైన సలహాలు వంటి కార్యక్రమాలను ఈనెల 30వ తేదీలోగా పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.వాణిజ్యస్థాయి పాడి పరిశ్రమ యూనిట్లు ఆధునిక పద్ధతిలో కూడిన కోళ్ల పెంపకము వ్యవసాయము చేనేత సూక్ష్మస్థాయి చిల్లర వ్యాపారాలు వంటి ఆచరణ సాధ్యమైన ప్రాంతీయ వ్యాపారాలకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. అత్యంత నిరుపేద ఎస్ సీ కుటుంబాలకు గ్రాంట్ తో అనుసంధానించబడిన బ్యాంకు రుణాన్ని ఎలాంటి అడ్డంకులు లేకుండా మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.చదువుకున్న నిరుద్యోగ ఎస్. సి. యువతీ యువకులకు వారికి ఆసక్తిగల రంగాలలో నైపుణ్యంతో కూడిన శిక్షణ పొందిన తరువాత వారు ఎంచుకున్న వ్యాపార రంగానికి కావలసిన ఆర్థిక సహాయమును సంబంధిత బ్యాంకులో నుండి ,ఎస్సీ సంక్షేమ శాఖ నుండి, పీఎం అజయ్ పథకం కింద సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడి జీ రమేష్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘ కార్యాలయంలో, 18వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటలకు గుడ్లవల్లేరు ఎంపీడీవో కార్యాలయంలో నైపుణ్య ఉపాధి మేళా లు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్కు వివరించారు.ఈ సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు బీసీ సంక్షేమ అధికారి జి రమేష్, జెడ్పీ డిప్యూటీ సీఎం ఆనందకుమార్, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, డిఐసి జీఎం వెంకటరావు, పశుసంవర్ధక శాఖ ఏడి నరసింహస్వామి, ఎల్డీఎం రవీంద్ర రెడ్డి, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, కరస్పాండెంట్ రమేషు, ఎస్సీ కార్పొరేషన్ పర్యవేక్షకులు శారద తదితర అధికారులు పాల్గొన్నారు.

## బీడీ, గని, సినీ కార్మికుల పిల్లల ఉపకార వేతనాల కోసం 2026-27 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల ఆహ్వానం

**విజయవాడ(పి.ఐ.బి.),జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన కార్మిక సంక్షేమ సంస్థకు సంబంధించిన వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం 2026--27 విద్యా సంవత్సరానికి వివిధ ఉపకారవేతన పథకాల కింద ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న బీడీ కార్మికులు, సున్నపురాయి- డోలమైట్, ఇనుప ఖనిజం, మాంగనీస్ - క్రోమ్ ఖనిజాల, అభ్రకం గనులు కార్మికులు, సినీ కార్మికుల పిల్లలకు ఈ ఉపకారవేతనాలు ఇస్తారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు (ప్రీ-మెట్రిక్), 11వ తరగతి నుంచి వృత్తి నిపుణుల డిగ్రీ కోర్సుల వరకు (పోస్ట్-మెట్రిక్) చదువుతున్న విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

**ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీలు:**

ప్రీ-మెట్రిక్ (1 నుంచి 10వ తరగతి వరకు): 2026 ఆగస్టు 31

పోస్ట్-మెట్రిక్ (11వ తరగతి నుంచి వృత్తి నిపుణుల డిగ్రీ వరకు): 2026 అక్టోబర్ 31 అభ్యర్థులు దరఖాస్తులను నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా సమర్పించవచ్చు.

దరఖాస్తు సమర్పణ, వెరిఫికేషన్ విషయంలో సహాయం కోసం అభ్యర్థులు ఎన్ఎస్‌పీ హెల్ప్‌డెస్క్ నంబర్: 0120-6619540 లేదా helpdesk@nsp.gov.in


ఈమెయిల్ ద్వారా సంప్రదించొచ్చు.మరింత సమాచారం కోసం అభ్యర్థులు 'వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం, కార్మిక సంక్షేమ సంస్థ, రూమ్ నంబర్ 54, కేంద్రీయ సదన్, సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్ -- 500001 (ఫోన్: 040-29561297, ఈమెయిల్: wclwohyd@nic.in) లేదా తమకు సమీపంలో ఉన్న ఈ సంస్థ వైద్యశాలలను సంప్రదించొచ్చు.అర్హులైన విద్యార్థులు, తల్లిదండ్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువు కంటే ముందే దరఖాస్తులను సమర్పించాలని వెల్ఫేర్ కమిషనర్ కోరారు.

## అద్భుతం.. రామతీర్థం బీచ్ సామూహిక యోగా

*అందమైన సాగర తీరంలో... మనసుకు హాయి గొలిపే ఆహ్లాదకర వాతావరణంలో యోగాసనాలు*





**నెల్లూరు జూన్ 16 (వార్తాప్రభ)** అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21)ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర--2026 కార్యక్రమంలో భాగంగా విడవలూరు మండలం రామతీర్థం సాగర తీరం వద్ద నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో సామూహికంగా యోగాసనాలు ఆచరించి యోగా ఔన్నత్యం చాటి చెప్పిన నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మరియు వివిధ శాఖల అధికారులు యోగా సాధకులు.యోగా గురువు డా.స్వప్న యోగాలోని ప్రతి ఆసనం ప్రాముఖ్యత ఆరోగ్య ప్రయోజనాలను వివరంగా తెలియజేస్తూ యోగాసనాలు చేయించారు.ప్రకృతి సోయగాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్న సముద్ర కెరటాలు వందలాది మంది యోగా సాధకుల ఆసనాలతో చైతన్యానికి ప్రతీకగా రామతీర్థం సముద్ర తీరం నిలిచింది.

## ఎస్.ఐ.ఆర్ సర్వే లో ఇంటింకి అప్లికేషన్ పారం అందజేత.



**పెనుగంచిప్రోలు, జూన్ 16( వార్త ప్రభ )** ఎస్.ఐ.ఆర్. ఓటర్ సర్వేలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు గ్రామంలో అప్లికేష్ న్ ఫారములు ఇంటి ఇంటికి అందజేసినారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి సతీష్, క్లస్టర్ ఇంచార్జ్ చుంచు రమేష్ బాబు, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు ,, నీటి సంఘం అధ్యక్షులు కర్ల నాగేశ్వరావు, బూత్ లెవెల్ ఏజెంట్ మహమ్మద్ ఆజాద్ , బూత్ కో కన్వీనర్ చింతల పాండవులు, బూతు లెవెల్ ఆఫీసర్ శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు...

## న్యాయ సహాయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

.... జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి.




**మచిలీపట్నం జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో పనిచేస్తున్న ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వలస కూలీలకు న్యాయ సహాయం అందించడానికి ప్రత్యేకించి ఏర్పాటుచేసిన క్లినిక్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గుట్టాల గోపి కోరారు. మంగళవారం సాయంత్రం నగరంలోని ప్రజా రవాణా సంస్థ ఆర్టీసీ బస్టాండ్ లో నూతనంగా ఏర్పాటుచేసిన న్యాయ సహాయ క్లినిక్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి దిశా న్యాయమూర్తి వరలక్ష్మి తో కలిసి ప్రారంభించారు.. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మణిపూరు, త్రిపుర, మిజోరం చుట్టుపక్కల ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కార్మికులు వివిధ రకాల పనుల కోసం జిల్లాలో పనిచేస్తున్నారని, వారికి అన్యాయం జరిగితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు న్యాయ సహాయం అందించే ఉద్దేశంతో న్యాయ సహాయ క్లినిక్ ను ఏర్పాటు చేశామన్నారు.ఈశాన్య రాష్ట్రాల వలస కార్మికులకు ఉపాధిలో ఏమైనా సమస్యలు ఏర్పడితే ఎవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.అలాంటి వాళ్లకు సత్వర న్యాయం అందించేందుకు అత్యున్నత న్యాయస్థానం, జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలు సంయుక్తంగా ఏపీఎస్ఆర్టీసీ వారి సహకారంతో న్యాయ సహాయ క్లినిక్ ను ఏర్పాటు చేశామన్నారు. పురప్రజలకు వలస కార్మికులుగా పనిచేస్తున్న వారికి ఎవరికైనా ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక న్యాయ సహాయ క్లినిక్ సంప్రదించేలా తెలియజేయాలన్నారు.జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఈ క్లినిక్ లో సేవలు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. న్యాయ సహాయం అందించడానికి ప్రత్యేకించి ఒక న్యాయ సహాయ కౌన్సిలర్ అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో డిపిటివో వెంకటేశ్వర్లు, ఆర్టీసీ డిపో మేనేజర్ డిపో మేనేజర్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన యోగ పోటీలు...



**మచిలీపట్నం జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నేతృత్వంలో వివిధ రకాల యోగా పోటీలు నేటితో విజయవంతంగా ముగిశాయి. ఈనెల 7 తేదీ నుండి గ్రామస్థాయిలో, 10వ తేదీ నుండి మండల స్థాయిలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగ పోటీలు నిర్వహించారు. ఈనెల 14 తేదీన మొదలైన జిల్లా స్థాయి పోటీలు 16వ తేదీ మంగళవారంతో ముగిశాయి.జిల్లా స్థాయిలో నగరంలోని జెడ్పీ కన్వెన్షన్ హాలులో జూనియర్లు, యువతీ యువకులు, వయోవృద్ధుల విభాగాలలో యోగా పోటీలు నిర్వహించారు.మూడవ రోజు జిల్లా స్థాయి పోటీలలో యోగా పాటలు, నినాదాలు,వ్యాసరచన, ఛాయాచిత్రాలు, క్విజ్ అంశాలపై జూనియర్, సీనియర్ల విభాగాలలో పోటీలు నిర్వహించారు. యోగ పోటీలు పాటల అంశంలో జూనియర్ భాగంలో యు రామకుమారి, సీనియర్ల విభాగంలో ముదిగొండ శాస్త్రి విజేతలుగా నిలిచారు.నినాదాలు అంశంలో జూనియర్ల విభాగంలో బి ప్రత్యూష, వ్యాసరచన అంశంలో జూనియర్ల విభాగంలో ఎన్ సరిత, ఛాయాచిత్రాల అంశంలో జూనియర్ విభాగంలో పి నాగమణి, క్విజ్ అంశంలో జూనియర్ విభాగంలో యు రామకుమారి విజేతలుగా ఎంపికయ్యారు. అన్ని అంశాలలోనూ సీనియర్ విభాగంలో ముదిగొండ శాస్త్రి ప్రతిభ చూపి విజేతగా నిలవడం చెప్పుకోదగ్గ విశేషం. ఈ యోగా పోటీలకు న్యాయ నిర్ణయితలుగా జి కృష్ణ, మద్దాల చింతయ్య, ఎన్ వి ఆర్ భాష్యం, యు. కార్తీక్, ఆర్ డి ప్రసాద్ వ్యవహరించారు. యోగా పోటీలను ఆయుష్ అధికారులు డాక్టర్ వాహిని, డాక్టర్ మానస, డాక్టర్ సుమిత్ర, డాక్టర్ రత్నకుమారి పర్యవేక్షించారు.

## తప్పి పోయిన బాబు ను వెతికి పేరెంట్స్ కు అప్పజేపిన పోలీస్ అధికారులు



**పెనుగంచిప్రోలు, జూన్ 16( వార్త ప్రభ )** శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయం వద్ద భక్తుల రద్దీ లో ఒక బాబు తప్పి పోవడం తో వారు పోలీస్ వారికి తెలియని జేయ గా,, పోలీస్ వారు సి.సి. కెమెరా ల ద్వారా వెతికి బాబు ఎక్కడ వుంది తెలుసుకోగలిగారు. బాబు ను ఎస్.ఐ. అర్జున్ ఆధ్వర్యంలో వెతికి జగ్గయ్యపేట సి.ఐ. వెంకటేశ్వర రావు సమక్షంలో వెంటనే పేరెంట్స్ అప్పచెప్పిన్నారు.బాబు కుటుంబ సభ్యులు పోలీస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.


## ఉత్తమ విద్యార్థులకు బీజేపీ సత్కారం

10వ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థునులకు అభినందించిన బిజెపి నేతలు



**ఇబ్రహీంపట్నం, జూన్ 16(వార్తా ప్రభ ప్రతినిధి):**-పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ స్థానాలు సాధించి విశేష ప్రతిభా వంతులను కొండపల్లి బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించి ఏమంటారో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ నూతలపాటి బాలకోటేశ్వరావు(బాల) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కొండపల్లి మరియు కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి ఆధ్వర్యంలో విద్యార్థునులను దుశ్శాలువాతో సన్మానించి, పుస్తకాలు,పెన్నులు మరియు జ్ఞాపిక ను అందజేశారు. 600 కు గాను 576మార్కులతో ( 96 శాతం)10 వ తరగతి లో స్కూల్ ప్రథమం, మండలం లో కూడా ప్రథమ స్థానం పొందిన విద్యార్థి ఆనం వెంకట తణ్మయి అందరి ప్రశంసలు అందుకుంది. మరో విద్యార్థిని మిరియాల హాస్మిత 574 మార్కులతో పాఠశాల ద్వితీయ స్థానం మరియు మండల పరిధిలో ద్వితీయ స్థానం సాధించినది. దర్శనం అక్షయ శ్రీ 559 మార్కులతో పాఠశాల తృతీయ స్థానం సాధించినది.ఈ కార్యక్రమంలో కార్యదర్శులు దాము భవాని,సేనాపతి నాగమణి, సీనియర్ నాయకులు రేగళ్ల రఘునాథరెడ్డి,కునాల యుగంధర్, మోకా సంజయ్ వర్మ, కల్పన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ అంకమ్మ తల్లి వెండి తాపడం కు 50 వేల విరాళం



**పెనుగంచిప్రోలు, జూన్ 16( వార్త ప్రభ )** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో వున్న శ్రీ అంకమ్మ తల్లి వెండి తాపడం కు ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ నగర, ఎనికెపాడు వాస్తవ్యులు సూర్యదేవర హరి చందన్, రాజరాజేశ్వరి దంపతులు ఆలయ కార్య నిర్వహణ అధికారి బి మహేశ్వర్ రెడ్డి సూచనల మేరకు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలోని శ్రీ అంకమ్మ అమ్మవారి ఆలయం వెండి తాపడం పథకములకు 50 వేల రూపాయలు విరాళంగా ఆలయ ఏఈఓ జంగం శ్రీనివాసరావు కు అందజేశారు.వారికి ఆలయ ఇన్స్పెక్టర్ బద్ధుల కృష్ణమోహన్, అర్చకులు, వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థప్రసాదములు అందజేసినారు...

## కేశినేని నాని పిట్టలదొర మాటలు ఆపాలి

**రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఫైజాన్**



**ఇబ్రహీంపట్నం, జూన్ 16 (వార్తా ప్రభ ప్రతినిధి):** విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) పై కేశినేని నాని చేస్తున్న వ్యాఖ్యలు పిట్టలదొరను తలపిస్తున్నాయని, నోటికి ఏది వస్తే అది మాట్లాడడం తప్ప వాస్తవాలు శూన్యమని ఎద్దేవా చేశారు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎంఎ ఫైజాన్. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో రెండు లక్షల 80 వేల ఓట్ల తో ఓడిపోయి, ఇప్పుడు నీతులు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. వైకాపా కోటిగా మారి వాళ్ళు ఇచ్చిన స్క్రిప్ట్ ను చదువుతూ పిట్టలదొరగా మారిపోయావు అన్నారు. ఎప్పుడో ఒకసారి నిద్రలేచి సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారాలు, లేనిపోని ఆరోపణలు, పదేళ్లుగా ఎంపీగా చేసిన వ్యక్తి తన స్థాయి మరిచి మాట్లాడటం తగదని హెచ్చరించారు రాబోయే రోజుల్లో అబద్ధపు ప్రచారాలు బూటకపు మాటలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ప్రతి ఒక్కరికి శిక్షలు తప్పవని అబద్ధపు ప్రచారాలు చేయటమే కాదు నిరూపించాలని ఫైజాన్ సవాలు చేశారు. మళ్లీ మళ్లీ మన ప్రియతమ నాయకుడు కేశినేని శివనాథ్ చిన్ని పై తప్పుగా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని ఎస్ ఎం ఫైజాన్ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.

## విద్యార్థులను అభినందిస్తున్న చేజర్ల యుటిఎఫ్ శాఖ


**చేజర్ల ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్రానికే ఆదర్శం....మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం**





**చేజర్ల జూన్ 16 (వార్తాప్రభ)** చేజర్ల యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 10 వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన చేజర్ల మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యు.టి.ఎఫ్ ఆధ్వర్యంలో అభినందన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చేజర్ల మండల ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్రానికి ఆదర్శంగా ఉన్నాయని కొనియాడారు. 15 సంవత్సరాల క్రితమే చేజర్ల మండలంలోని మారుమూల గ్రామాలైన ఎన్జీ అగ్రహారం మాముడూరు బిల్లుపాడు నాగుల వెల్లటూరులో తల్లిదండ్రుల సహకారంతో ఇంగ్లీష్ మీడియం ప్రారంభించి మూతపడబోతున్న పాఠశాల నిలబెట్టుకోవడం అభినందనీయ మని చెప్పారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ యుటిఎఫ్ ఇంతటి మహత్తర కార్యక్రమం చేయడం అభినందనీయం అన్నారు. 2026వ సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో చేజర్ల మండలంలోని విద్యార్థినీ విద్యార్థులు జిల్లాలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరచడం జరిగింది. చేజర్ల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మరియు ఎ.పి రెసిడెన్షియల్ పాఠశాలలో చదివిన విద్యార్థులలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను 550 పైగా మార్కులు వచ్చిన మొత్తం 34 మంది విద్యార్థులను 100 శాతం రిజల్ట్ వచ్చిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులను తను బోధించే సబ్జెక్టులో విద్యార్థులకు 100 కి 100 మార్కులు వచ్చేలా కృషి చేసిన 25 మంది ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన చేయడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమనికి జిల్లా అధ్యక్షులు వి.వి.శేషులు జిల్లా కార్యదర్శి యన్. రమణయ్య యుటిఎఫ్ నాయకులు ఎం.రవి బాబు సుబ్రహ్మణ్యం ఎన్ బుజ్జయ్య ఆర్.వి కృష్ణారెడ్డి ఎ.వెంకటేశ్వర్లు పి నరహరి షేక్ మస్తాన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విజయోత్సవ సభకు చేజర్ల టిడిపి నాయకులు




**చేజర్ల జూన్ 16 (వార్తాప్రభ)** కస్తూరీదేవి గార్డెన్ లో రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సంబరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి మరియు కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడుతో కలిసి విజయోత్సవ సభలో ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ షేక్ సిరాజుద్దీన్ చేజర్ల మండల సొసైటీ అధ్యక్షులు బూదళ్ల వీర రాఘవరెడ్డి జిల్లా మండల తెలుగుదేశం ఎస్సీ సెల్ అధ్యక్షులు సోమవరపు హజరత్తయ్య బి.వెంకటేశ్వర్లు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మోడీ సారధ్యంలో అభివృద్ధిలో దూసుకెళ్తున్న భారతదేశం

- 12 ఏళ్ళలో చేసిన అభివృద్ధి ప్రజలకు చెప్పాలి
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి
- రాయన పాడు శాటిలైట్ రైల్వే స్టేషన్ ను సందర్శించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బీజేపీ అధ్యక్షుడు మాధవ్, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి





**ఇబ్రహీంపట్నం, జూన్ 16 (వార్తా ప్రభ ప్రతినిధి):** నరేంద్ర మోడీ సాధ్యంలో 12 ఏళ్ల బిజెపి ప్రభుత్వంలో దేశం అభివృద్ధిలో అగ్ర రాజ్యాలకు పోటీగా దూసుకెళ్తుందని తెలిపారు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి. మంగళవారం నాడు రాయనపాడు సాటిలైట్ స్టేషన్, విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు లను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 35 కోట్లు రాయనపాడు రైల్వేస్టేషన్ అభివృద్ధి కి వినియోగించారని, 12 సంవత్సరాలు అత్యధిక కాలం ప్రధానిగా మోదీ ఉన్నారు..12 ఏళ్ళలో చేసిన అభివృద్ధి ప్రజలకు తెలియాలని అన్నారు. 65 ఏళ్ళు పాలించిన గత ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి చేయలేదు దేశంలో రైల్వే 100 శాతం విద్యుదీకరణ జరుగుతుంది. మన రైల్వే నెట్వర్క్ 1.05 లక్షల కిలోమీటర్లు. విద్యుదీకరణ జరగకపోతే లక్ష కోట్ల లీటర్ల డీజిల్ దిగుమతి చేసుకోవాలి. సూర్యుడు ముందు నుంచే ఉన్నాడు. సూర్యుని శక్తిని వినియోగించడం మోది తెలుసుకున్నారు..భవిష్యత్తులో చాలా చేయాల్సి ఉంది.. వికసిత భారత్ కూడా చేయాల్సి ఉందిఅమరావతిని ప్రధాని మోదీ నేతృత్వంలో రాజధానిగా నిర్ణయించి గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు..దేశంలోని ప్రధాన నగరాలను కలుపుతూ అమరావతికి రైల్వే లైన్ వస్తుంది. 2026-27 10,144 కోట్లు ఏపీలో రైల్వేలో మౌళిక అభివృద్ధి కి ఇచ్చాం. ఏపీలో సీఎం చంద్రబాబు, పవన్ లతో కలిసి అభివృద్ధి దిశగా పనులు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మైలవరం సీనియర్ నాయకులు నూతలపాటి బాలకోటేశ్వరావు (బాల), బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి కృషి ఫలం

**పద్మశాలి టౌన్షిప్ లో అతి త్వరలో త్రాగునీటి రిజర్వాయర్ నిర్మాణం, మరియు అంతర్గత త్రాగునీటి వసతి.**




**కాప్రా, జూన్ 16: (వార్తా ప్రభ)** కాప్రా పరిధిలోనిపద్మశాలి టౌన్షిప్ లో జలమండలి ఈడి పంకజం పర్యటన. పద్మశాలి టౌన్షిప్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ-పద్మశాలి టౌన్షిప్ లో రిజర్వాయర్ ఏర్పాటుకు మరియు అంతర్గత త్రాగునీటి పైప్ లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండని అధికారులకు ఆదేశించడం జరిగిందన్నారు. డిసెంబర్ వరకు రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తామని తద్వారా త్రాగునీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, ఏఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రాజు పాకాల, మేడ్చల్ జిల్లా మైనారిటీ చైర్మన్ అజీజ్ బేగ్, మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, ఏఎస్ రావు నగర్-కాప్రా డివిజన్ల కాంగ్రెస్ నాయకులు అల్లురయ్య, పెద్ది శ్రీనివాస్, తన్నీరు శ్రీహరి, జి. సత్యనారాయణ, ముర్తుజా, సందీప్ గౌడ్, నర్సింహా, నాగేశ్వర్ రావ్, ఉమేష్, భరత్ తదితరులు మరియు పద్మశాలి టౌన్షిప్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాండాల అనురాధ యాదగిరి గౌడ్, దీప అరవింద్, నవనీత పున్న, దొంత మాధవి, సునీత, సాహితీ, ప్రియాంక, వనజ, శ్రీదేవి, పోలీస్ లక్ష్మీ, టీచర్ లక్ష్మీ, శైలజ, కవిత, నాగమణి, నారా జనార్దన్, దొంత శ్రీనివాస్, విజయ్, నర్సింహా గౌడ్, కరుణాకర్, రజినీకాంత్, జయకర్, పలది శ్రీనివాస్, సుభాష్, వేముల కృష్ణ, మధుసూదన్, వంశీ, శ్రీనివాస్ వర్మ, రాజేష్, జయకర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## చిల్లకల్లులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్ ) కార్యక్రమాన్ని పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు




**జగ్గయ్యపేట జూన్ 16 (వార్తప్రభ)** మండలం, చిల్లకల్లు గ్రామంలో బూత్ నెంబర్ 79 లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్ ) కార్యక్రమంలో పాల్గొని పరిశీలించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ గొర్రెపాటి బుల్లయ్య, బీఎల్వో హారిక మరియు సంబంధిత సిబ్బందితో కలిసి బూత్ల వారీగా కార్యక్రమం నిర్వహణను సమీక్షించారు. బూత్ల పరిధిలోని ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించి అవగాహన కల్పించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పూర్తిస్థాయి పారదర్శకతతో జరగాలని కోరారు. ఓటర్లలో తమ ఓటు తొలగించబడుతుందేమో లేదా నకిలీ ఓట్లు నమోదవుతాయేమో అనే భయాందోళనలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే బీఎల్వోలు లేదా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు, ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ప్రారంభమైన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం జూలై 14 వరకు కొనసాగుతుందని, ఈ కాలంలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. గతంలో 2014-2019 కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సేవా మిత్ర పేరుతో వైఎస్ఆర్ సీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. ప్రస్తుతం మై టీడీపీ పాస్పోర్ట్ యాప్ ద్వారా కూడా ఓటర్ల తొలగింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొంటూ, ఈ అంశంపై ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్ మండల రైతు విభాగ కార్యదర్శి గొళ్ళ రామకృష్ణ ఉప్పల రంగ, గాలం గోపి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రికి రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే



**జగ్గయ్యపేట జూన్ 16 (వార్తప్రభ)** నియోజకవర్గ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి నివాసంలో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ని కలిసి జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలోని రైతుల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ఈ సీజన్లో వరి దిగుబడి అధికంగా నమోదైందని, రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలో ఉప్పుడు బియ్యం (బాయిల్డ్ రైస్ ) సేకరణకు కేవలం 5 వేల టన్నుల లక్ష్యాన్ని మాత్రమే కేటాయించినట్లు పేర్కొంటూ, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అదనంగా 30 వేల టన్నుల ఉప్పుడు బియ్యం సేకరణ లక్ష్యాన్ని మంజూరు చేయాలని కోరారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తికి సరైన మార్కెట్ లభించేలా భారత ఆహార సంస్థ (ఎఫ్ సి ఐ) ద్వారా అదనపు సేకరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సంక్షేమం దృష్ట్యా ఈ అంశాన్ని అత్యవసరంగా పరిశీలించి, ఎన్టీఆర్ జిల్లాకు అదనంగా 30 వేల టన్నుల ఉప్పుడు బియ్యం సేకరణ లక్ష్యాన్ని మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సమర్పించిన వినతిపత్రంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కోరారు. కేంద్ర మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి వినతిపత్రాన్ని స్వీకరించి, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

## నూతన మున్సిపల్ కమిషనర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్ఆర్సిపి మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్



**జగ్గయ్యపేట జూన్ 16 (వార్తప్రభ)** ఇటీవల గ్రూప్ వన్ 2009 బ్యాచ్ కి సంబంధించిన అధికారి మున్సిపల్ కమిషనర్ గా జగ్గయ్యపేట పురపాలక సంఘానికి బదిలీ అయిన పివిడివి ప్రసాద్ ను జగ్గయ్యపేట పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఐదవ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ మర్యాదపూర్వకంగా వారిని కలిసి పూలబోకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ నిధులు, గ్రాంట్లు, వార్డు అభివృద్ధి విషయాలు అన్నిటిపై స్థానిక వార్డు ప్రజాప్రతినిధులుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాకు సహకరించాలని ప్రోటోకాల్ సచివాలయ సమావేశాలకు కనీస గౌరవాన్ని అశీదేవిధంగా అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలు, దీర్ఘకాలంగా వార్డులో ఉన్న పెండింగ్ సమస్యలకు కమిషనర్ గా సహకరించాలని రాజకీయాలు అతీతంగా ప్రజాప్రతినిధులుగా మమ్ములను గుర్తించి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రావు ని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రావు మాట్లాడుతూ కచ్చితంగా అభివృద్ధి విషయంలో ప్రభుత్వం తరఫున అధికారిగా తన వంతు సహకారాన్ని వార్డు అభివృద్ధికి ప్రజాప్రతినిధులకు సంబంధించిన గౌరవాన్ని కచ్చితంగా అందేలా చూస్తామని వార్డు సమస్యల మీద త్వరలో వార్డు పర్యటన చేసి పరిష్కారం దిశగా పనిచేస్తామని చెప్పడం జరిగింది.

## నగర పరిశుభ్రతకు ప్రాధాన్యం

**- పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ జూన్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం మహాత్మా గాంధీ రోడ్, లోబ్రిడ్జి, బీఆర్టీఎస్ రోడ్డు, కృష్ణవేణి క్లాత్ మార్కెట్, నైజాం గేట్, గాంధీ హిల్ ప్రాంతాలలో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, వ్యర్థాల తొలగింపు, కాలువల శుభ్రత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా పంజా సెంటర్ సమీపంలోని కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులను పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ సజావుగా పనిచేసేలా పూడిక తొలగింపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పూడిక తొలగింపునకు వినియోగిస్తున్న యంత్రాల పనితీరును కూడా పరిశీలించారు. అనంతరం నైజాం గేట్ ప్రాంతంలో కాలువల్లో తేలియాడుతున్న వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, వ్యర్థాల తొలగింపు చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నగరంలోని ప్రధాన కాలువలు, డ్రైన్లు, ప్రజా ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్త సేకరణ, వ్యర్థాల తొలగింపు, కాలువల శుభ్రత కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగించాలని కమిషనర్ ఆదేశించారు. నగర ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తదుపరి వన్ టౌన్ లోని గాంధీజీ మహిళా కళాశాల సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ను కమిషనర్ ధ్యానచంద్ర క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్లో అందిస్తున్న ఆహార నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ, వంటశాల పరిశుభ్రత, తాగునీటి సరఫరా తదితర అంశాలను స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్న క్యాంటీన్కు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే క్యాంటీన్ నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, ప్రజలు ఎదుర్కొనే ఏవైనా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె. శ్రీనివాస్, గోపాల కృష్ణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ సిబ్బంది పాల్గొన్నారు.

## గుండ్ల చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన తొండపు దశరథ జనార్దన్



**వత్సవాయి జూన్ 16 (వార్తప్రభ)** మండలం లింగాల గ్రామ పరిధిలో ఉన్న గుండ్ల చెరువు అభివృద్ధి పనులను జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ మరియు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, సంబంధిత అంశాలపై స్థానికులతో మరియు బాధ్యులతో చర్చించారు. గుండ్ల చెరువు అభివృద్ధి వల్ల పరిసర ప్రాంత ప్రజలకు, రైతులకు మరియు నీటి వనరుల పరిరక్షణకు ఉపయోగకరమైన ఫలితాలు అందేలా పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ మరియు సహజ వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## భారత నౌకాదళ సబ్ లెఫ్టినెంట్గా ఎంపికైన సత్య వర్ధన్ ను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



**వత్సవాయి జూన్ 16 (వార్తప్రభ)** మండలం, కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేముల వెంకటేశ్వర రావు కుమారుడు సత్య వర్ధన్ యూపీఎస్సీ నిర్వహించే 148 కోర్స్ ఎండీఏ ద్వారా( అల్ ఇండియా 112 ర్యాంక్)భారత నౌకాదళం (ఇండియన్ నేవీ)లో ప్రతిష్టాత్మకమైన సబ్ లెఫ్టినెంట్గా ఎంపికై తీరని కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారు. ఈ ఘన విజయానికి గుర్తింపుగా, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తన కార్యాలయంలో యువ అధికారి సబ్ లెఫ్టినెంట్ సత్య వర్ధన్ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ గారు మాట్లాడుతూ. సత్య వర్ధన్ పట్టుదల, క్రమశిక్షణతో శ్రమించి దేశ రక్షణ రంగానికి ఎంపిక కావడం మన ప్రాంతానికే గర్వకారణమన్నారు. ఆయనను శాలువా మెమెంటో తో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. రక్షణ రంగంలో చేరాలనుకునే స్థానిక యువతకు సత్య వర్ధన్ ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తారని ఎమ్మెల్యే కొనియాడారు. దేశ సేవలో చేరేలా కుమారుడిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను కూడా ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు, మరియు గ్రామ పెద్దలు పాల్గొని యువ సబ్ లెఫ్టినెంట్కు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, రవి మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

# "ల్యాబ్ ఆన్ వీల్స్" కార్యక్రమానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ శ్రీకారం

**● విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతకు దోహదం**

**రామచంద్రపురం,జూన్ 16 (వార్తాప్రభ) :** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాల పెంపుదలకు దోహదపడే "ల్యాబ్ ఆన్ వీల్స్" కార్యక్రమాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం స్థానిక ఎస్ ఎల్ బి మున్సిపల్ హైస్కూల్లో ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వినూత్న కార్యక్రమం ద్వారా విద్యార్థులకు స్టెఎం(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) రంగాల్లో ప్రత్యక్ష అనుభవంతో కూడిన శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. "ల్యాబ్ ఆన్ వీల్స్" ద్వారా సైన్స్ ప్రయోగాలు, ఇంటరాక్టివ్ మోడల్స్, టెక్నాలజీ ఆధారిత ప్రదర్శనలతో విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలు పెంపొందుతాయని తెలిపారు. ఈ మొబైల్ లెర్నింగ్ వాహనంలో ఎలక్ట్రానిక్స్, మైక్రోకంట్రోలర్ ఆధారిత ప్రాజెక్టులు, రోబోటిక్స్ ప్రాజెక్టులు వంటి ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విజయవంతంగా అమలైన ఈ కార్యక్రమం ద్వారా 20 వేల మందికి పైగా విద్యార్థులు, యువత లబ్ధి పొందారని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లాలో జూన్ 16 నుండి ఆగస్టు 16 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, స్కిల్ హబ్‌ల



విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, ఆవిష్కరణాత్మక భావాలను పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వాసంశెట్టి శ్రీ సత్య, ఏ పి ఎస్ ఎస్ డి సి కోఆర్డినేటర్ ఆర్ రఘువర్మ, మండల విద్యాశాఖ అధికారులు,ఎమ్ శ్రీనివాసరావు, వి నాగేశ్వరి, హెచ్ఎం సిహెచ్ పూర్ణ ప్రియ, ఐ.ఈ. కో - ఆర్డినేటర్స్ సత్యనారాయణ, విఠల్,ఇన్ఫోసిస్ ప్రతినిధులు, చందమామ వాసు, హైస్కూలు టీచింగ్ బృందం, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాణం దాడికి గురైన గిరిజనుడి శస్త్ర చికిత్స విజయవంతం




**కాకినాడ,జూన్ 16 (వార్తాప్రభ) :** రంపచోడవరం మండలం చెరువుపాలెం గ్రామానికి చెందిన చోళ్ల లచ్చిరెడ్డి బాణం దాడికి గురికాగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న సమయంలో కాకినాడ ప్రభుత్వ సర్వజన సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్) వైద్య బృందం విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిందని సూపరింటెండెంట్ డా.లావణ్య కుమారి వెల్లడించారు.ఛాతీలో లోతుగా దూసుకెళ్లిన బాణం కారణంగా తీవ్ర గాయాలతో ప్రాణాలు నిలబడే అవకాశాలు సన్నగిల్లిన పరిస్థితుల్లో వైద్యులు చేసిన సమయోచిత చికిత్స రోగికి పునర్జన్మనిచ్చిందని తెలిపారు. ఈ క్లిష్ట శస్త్రచికిత్సకు కార్డియో థొరాసిక్ అండ్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ మదన్ మోహన్ నాయకత్వం వహించారు.ఛాతీ భాగంలో గుండె, ఊపిరితిత్తులు, ప్రధాన రక్తనాళాలకు అత్యంత సమీపంలో ఉన్న బాణాన్ని తొలగించడం అత్యంత సవాలుతో కూడుకున్న ప్రక్రియ. సుమారు మూడున్నర గంటల పాటు సాగిన శస్త్రచికిత్సలో డాక్టర్ మదన్ మోహన్‌తో పాటు జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ నరేష్, అనస్థీషియా నిపుణుడు డాక్టర్ ప్రసన్న కుమార్, వారి వైద్య బృందం సమన్వయంతో పనిచేసి రోగిని సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడేశారు. ఆపరేషన్ అనంతరం కూడా వైద్యులు నిరంతర పర్యవేక్షణ అందించి రోగి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్‌కు సిద్ధంగా ఉన్నాడని తెలిపారు.డాక్టర్ మదన్ మోహన్ నేతృత్వంలోని వైద్య బృందాన్ని, డాక్టర్ ఎస్. లావణ్య కుమారి అభినందించారు. సి.ఎస్.ఆర్.ఎం.ఓ డాక్టర్ పితాని కోమలి, డిప్యూటీ సి.ఎస్.ఆర్.ఎం.ఓ డాక్టర్ మెహర్, జనరల్ సర్జరీ హెచ్.ఓ.డి డాక్టర్ నరేష్,అనస్థీషియా విభాగానికి చెందిన డాక్టర్ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.


# జూన్ 20వ తేదీన పీఎం కిసాన్ 23వ విడత నిధులు విడుదల

**-మిత్తి రెడ్డి మధుసూదన్ రావు వెల్లడి**



**రాజాం,జూన్ 16 (వార్తాప్రభ) :** జూన్ 20వ తేదీన పీఎం కిసాన్ 23వ విడత నిధులు చేస్తారని భారతీయ జనతా పార్టీ విజయనగరం పార్లమెంటరీ జిల్లా సీనియర్ నాయకులు మిత్తిరెడ్డి మధుసూదనరావు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ రైతాంగం సంక్షేమమే లక్ష్యంగా 2018 సంవత్సరంలో పీఎం కిసాన్ పథకం ద్వారా మొదటి విడత (ఏప్రిల్ -జూలై) రెండో విడత (ఆగస్టు- నవంబర్) మూడో విడత (డిసెంబర్-మార్చ్) ఏడాదికి 6000 రూపాయలు ఇస్తున్న సంగతి తెలిసిందే, అందులో భాగంగా ఈనెల 20వ తేదీన హుగ్లీ, పశ్చిమబెంగాల్ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 23వ విడత పిఎం కిసాన్ సమాన్ నిధి 18,880 కోట్ల నిధులను 9.84 కోట్ల రైతుల వ్యక్తిగత ఖాతాలలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ద్వారా బదిలీ చేయడం జరుగుతుందని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ నిర్ణయించడం జరిగిందన్నారు.

# అమలాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండేపూడి కన్నుమూత



**అమలాపురం,జూన్ 16 (వార్తాప్రభ) :** అమలాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండేపూడి సత్యనారాయణ మంగళవారం ఉదయం మరణించారు. గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్యనారాయణ మంగళవారం ఉదయం తీవ్ర గుండెపోటు రావడంతో ముమ్మిడివరం సమీపంలోని బొండాయికోడు వద్ద ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. 1988లో ముమ్మిడివరం ఆంధ్రభూమి కంట్రిబ్యూటర్ గా జర్నలిజంలో ప్రవేశించిన సత్యనారాయణ దాదాపు మూడున్నర దశాబ్దాల పాటు.. ఆంధ్రభూమి మూసివేతకు గురయ్యే వరకు ముమ్మిడివరం, అమలాపురం కేంద్రాలలో ఆ పత్రికలో పని చేశారు. కోనసీమ వ్యాప్తంగా 'ఆంధ్రభూమి సత్య నారాయణ' గానే ఆయన పాపులర్ అయ్యారు. కరోనా సమయంలో ఆంధ్రభూమి మూసివేత అనంతరం విశాలాంధ్ర దినపత్రిక అమలాపురం ప్రతినిధిగా సత్యనారాయణ సేవలందించారు. జర్నలిస్ట్ గానే కాకుండా జర్నలిస్ట్ ఉద్యమ నాయకునిగాను సత్యనారాయణ సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులుగా గతంలో సేవలందించిన సత్యనారాయణ ప్రస్తుతం అమలాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పని చేస్తున్నారు. ఆయన మరణం పట్ల అమలాపురం ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తీవ్ర విచారాన్ని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.ఎస్.వి. ప్రసాద్ (మండేల బాబీ), ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కాకర సుధీర్, అమలాపురం ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు బోళ్ళ సతీష్ బాబు, రంబాల సత్యనారాయణ, అమలాపురం ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఎం.డి. బషీర్, జర్నలిస్టులు ప్రకాష్, అరిగెల రుద్రా శ్రీనివాస్, అబ్బాస్, ఆకుల రవితేజ, కుడుపూడి వెంకట సుబ్బారావు దొమ్మేటి వెంకట్, రంకిరెడ్డి కృష్ణ, రమేష్, కె. విజయ్, పొలమూరి సురేష్, ఆసు భరత్, ములపర్తి రవి తదితరులు సత్యనారాయణ భౌతికఖాయానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ వెంకటరమణ, బిజెపి జిల్లా శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, జనసేన నాయకులు సూదా చిన్న, వైసీపీ నాయకులు కాశి రామకృష్ణ తదితరులు దివంగత జర్నలిస్ట్ సత్యనారాయణ భౌతిక ఖాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సత్యనారాయణ అంత్యక్రియలు బుధవారం నాడు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

# రాజ్యసభ సభ్యుడు సానా ను కలిసిన మెట్ల



**అమలాపురం,జూన్ 16 (వార్తాప్రభ) :** రాజ్యసభ సభ్యులుగా రెండోవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం జిల్లాకు తొలిసారిగా విచ్చేసిన సానా సతీష్ బాబును మర్యాదపూర్వకంగా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు,అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు తదితర నేతలు కలసి శుభాకాంక్షలు తెలిపారు.మెట్ల రమణబాబు వెంట శ్రీ కళా వెంకట్రావు సొసైటీ చైర్మన్ అల్లాడ శరత్ బాబు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు బొర్రా వెంకటేశ్వరరావు, దున్నాల దుర్గ, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వర రావు, శ్రీ సుబ్బాలమ్మ దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి పుల్లయ్య నాయుడు, సన్నవిల్లి సర్పంచ్ చిక్కం జంగ్గామయ్య (పెదబాబు),పట్టణ తెలుగు యువత అధ్యక్షులు నల్లా మల్లిబాబు, పట్టణ కమిటీ కార్యదర్శి నల్లా సుబ్బారావు(చిన్నా), అమలాపురం ది. ఛాంబర్ అఫ్ కామర్స్ బోనం సత్తిబాబు, బులియన్ మార్కెట్ మాజీ అధ్యక్షులు చింతలపూడి సత్తిబాబు, బులియన్ మార్కెట్ కార్యదర్శి యర్రంశెట్టి నారాయణ మూర్తి, యాళ్ల భాస్కరరావు, ముత్యాల గంగాధర్, నల్లా చిట్టిబాబు, యర్రంశెట్టి చిరంజీవి, దున్నాల దిలీప్, పోలిశెట్టి కిరణ్ తదితరులు వున్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**తిరువూరు,జూన్ 16 (వార్తాప్రభ) :** తిరువూరు పట్టణంలో పెరుగుతున్న రద్దీ కారణంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి అంటూ ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తున్న ఎస్సై రాజు మెయిన్ రోడ్ లో ప్రతిరోజు ఇరువైపులా ఉన్న తోపుడు బండ్లు పెట్టి వ్యాపార నిర్వహిస్తూ ట్రాఫిక్ సమస్య కారణమవుతున్న తోపుడు బండ్లను సిబ్బందితో కలిసి పక్కకు తొలగించారు నిత్యవసర సరుకులతో వచ్చే లారీలు ట్రాఫిక్ సమస్య లేవనెత్తకుండా ఉదయం 8 గంటల నుండి 10 గంటల్లోపు దిగుమతి చేయాలి లేదా సాయంత్రం 6 గంటల నుండి దిగుమతి చేయాలని పార్సెల్ లారీ యజమానులకు డ్రైవర్స్ కు సూచన చేశారు ట్రాఫిక్కు నిబంధన అతిక్రమిస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాము ద్విచక్ర వాహనం తోలుతున్న మైనర్లను ఆపి మైనర్ల ద్విచక్ర వాహనాలు నడపకూడదు ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యులు మీకు ద్విచక్ర వాహనం ఇచ్చిన తల్లిదండ్రులు బాధ్యులు అవుతారని హెచ్చరించారు మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు వద్దని ఎస్సై రాజు విజ్ఞప్తి చేశారు

# కూటమి ప్రభుత్వం దీర్ఘ కాలం అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి

**● ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ● ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్ ల సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో తీసుకెళ్తున్న చంద్రబాబు. ● కూటమి ప్రభుత్వం 20 ఏళ్లు అధికారంలో ఉంటే, దేశంలోనే ఏపీ నెంబర్ వన్ ● ఏలూరు పార్లమెంటు అభివృద్ధికి నేతలంతా కలిసికట్టుగా కృషి చేస్తున్నాం.**

**● కూటమి ప్రభుత్వ సభలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్.**



**ఏలూరు,జూన్ 16 (వార్తాప్రభ) :** దీర్ఘ కాలం ఒకే ప్రభుత్వం అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. "రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం" పేరుతో రైతు సంక్షేమం ప్రాధాన్యంగా ఏలూరు ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన సభలో ఎంపీ మాట్లాడుతూ గుజరాత్ లో, కేంద్రంలో ఒకే పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్లే అభివృద్ధి సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 20 ఏళ్లు అధికారంలో ఉంటే, దేశంలోనే ఏపీ నెంబర్ వన్ గా మారుతుందన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులు తీసుకువచ్చి అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని, గ్రామీణాభివృద్ధిలో పవన్ కల్యాణ్ నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖ అద్భుతంగా పనిచేస్తోందన్నారు. కూటమిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, నరేంద్ర మోదీ సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు. గత రెండేళ్లలో ఏలూరు జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్, గత ప్రభుత్వ హయంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. జిల్లాలో అత్యధికంగా సాగు చేస్తున్న పామాయిల్ పంటకు మంచి ధర లభించడంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. కోకో, పొగాకు పంటలకు కూడా గిట్టుబాటు ధర లభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొల్లేరు సమస్యపై సిఈసీ తో మాట్లాడానని చెప్పిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఏడాదిలోపే శాశ్వత పరిష్కారం వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అభివృద్దే ధ్యేయంగా జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యేలు నేతలంతా కలిసికట్టుగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ఇంటికి వెళ్లిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై కాసేపు చర్చలు జరిపారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంకు చేరుకున్న ఎంపీ, గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. భారీగా తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలతో మాట్లాడిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఉదయం 11 గంటల సమయంలో కూటమి ప్రభుత్వ సభలో పాల్గొనేందుకు ఇండోర్ స్టేడియంకు బయలుదేరి వెళ్ళారు.

# డా బి ఆర్ అంబేత్కర్ విగ్రహంను కూటమి ప్రభుత్వం విధ్వంసానికి గురి చేసే కుట్ర ప్రజలందరు ఖండించాలి

**-గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి**



**విజయవాడ, జూన్ 16 (వార్తాప్రభ) :** విజయవాడ లోని "సామాజిక న్యాయం శిల్పం" డా బి ఆర్ అంబేత్కర్ 125 అడుగులు విగ్రహం ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం విధ్వంసానికి గురి చేసే కుట్ర చేస్తున్నాదాని,దానిని రాష్ట్ర ప్రజలు ఖండించాలని గన్నవరం మండలం జెడ్పీటీసీ, వైఎస్ఆర్ మహిళ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు అన్నవరపు ఎలిజబెత్ రాణి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆమే ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం సామాజిక న్యాయం శిల్పం డా బిఆర్ అంబేత్కర్ 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడ నడి బోర్డులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 450 కోట్లుతో సామాజిక దృక్పథంతో నిర్మించారన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం దానిని విధ్వంసానికి గురి చేస్తుందనీ, అక్కడకు వెళ్లిన ప్రజలందరు చూసి ఖండిస్తున్నారన్నారు. డా బిఆర్ అంబేత్కర్ విషయంలో అలా చేయటం తగదని వారు ఆవేదన ఆందోళన వ్యక్తం చేశారు .నేను స్వయంగా విన్నాను.నేను వారందరికీ రాజకీయాలతో సంబంధం లేకుండా రాష్ట్ర గవర్నర్ కి అక్కడ చూసిన ప్రతి అంశాన్ని లేఖల ద్వారా ఖండిస్తూ పంపాలని వారికి విజ్ఞప్తి చేస్తున్నా అని అన్నారు. అక్కడ ఒక వైపు డా అంబేద్కర్ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం జరుగుతుంది,, మరో వైపు సామాజిక న్యాయం శిల్పం నిర్వహణ నిర్లక్ష్యానికి గురి చేయటం జరుగుతుందన్నారు. ఫౌంటెన్లు పాచిపట్టి చెత్త చెదరంతో నిండి, కప్పలు సంచరించే స్థితికిచేరుకున్నాయని ఆమే ఆందోళన వ్యక్తం చేశారు.గ్రీనరి గార్డెన్లు ఎండిపోయి నిర్లక్ష్యానికి నిదర్శనశీగా కనిపిస్తున్నాయని అన్నారు.ఈ వ్యత్యాసం ఏ సందేశానికి ఇస్తుందో కూటమి ప్రభుత్వం చెప్పాలని ఆమే డిమాండ్ చేశారు.ఈ ప్రాంగణం ప్రజల ధనంతో నిర్మించిన విషయం ప్రజలందరికీ తెలిసిందే నని ఆమే అన్నారు. అంబేద్కర్ వ్రాసిన భారత రాజ్యాంగమే లేకుంటే దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు వారు, మైనార్టీల ప్రజలు ఏ పరిస్థితులలో ఉండే వారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు అటువంటి మహానుభావుడు డా అంబేత్కర్ గారు ఒక రాజకీయ నాయకుడు ఒక పార్టీ కాదని ప్రజలందరివాడని అనేది గుర్తుంచుకోవాలని ఆమే అన్నారు.

# రెండో రోజు కొనసాగిన తప్పనిసరి టెట్ పై ఫోర్ట్ నిరసన

**● రాష్ట్రవ్యాప్తంగా భోజన విరామ సమయంలో ప్లకార్డులతో ఆందోళన**


**● ఫోర్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డా. డి. శ్రీను, వర్కింగ్ సెక్రటరీ జనరల్ మాగంటి శ్రీనివాసరావు**



**విజయవాడ,జూన్ 16 (వార్తాప్రభ) :** ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు తప్పనిసరి టెట్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఫోర్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు రెండో రోజు కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగాయి. ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ శాంతియుత నిరసన తెలియజేశారు. విద్యా హక్కు చట్టం అమలుకు ముందే నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ ను తప్పనిసరి చేయడం అన్యాయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫోర్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డా. డి. శ్రీను, వర్కింగ్ సెక్రటరీ జనరల్ మాగంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 23(2) ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే సవరించి, అప్పటి అమల్లో ఉన్న అర్హతలు మరియు రాష్ట్ర నియామక నిబంధనల ప్రకారం ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తాయని తెలిపారు. జడ్పీహెచ్ఎస్ నాగాయలంక లో జరిగిన నిరసనలో ఫోర్ట్ వర్కింగ్ సెక్రటరీ జనరల్ మాగంటి శ్రీనివాసరావు,డి. పి.ఆర్.టి.యు.రాష్ట్ర కార్యదర్శి బి. రాఘవ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మైలవరం లో కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారాయి

**-ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు**






**మైలవరం,జూన్ 16 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం పట్టణంలోని పలు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో బుక్స్, యూనిఫాం స్టాల్స్ ను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మైలవరం మండల కమిటీ ఆధ్వర్యం లో మంగళవారం ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలో నారాయణ, శ్రీ చైతన్య స్కూల్స్, అలాగే రేసోనెన్స్ కాలేజ్ లలో పుస్తకాలు మరియు యూనిఫాముల వ్యాపారం జోరుగా సాగుతుందని తెలిపారు.స్థానిక ఎంఈవొ బాలు నాయక్ కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. దీంతో ఎంఈవొ నారాయణ, శ్రీ చైతన్య, వివేకానంద స్కూల్స్ లలో ఏర్పాటు చేసిన బుక్స్, ఇతర సామాగ్రిని నిల్వ చేసిన గదులను సీజ్ చేశారని వెల్లడించారు.ఒకపక్క కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు సంపాదనే ధ్యేయంగా మధ్యతరగతి కుటుంబాల అవసరాలను అవకాశం ఎలా తీసుకుని వారి జేబులు కొల్లగొడుతున్నాయని, అదే తరహాలో కొన్ని ప్రైవేట్ స్కూల్స్ కూడా దిగజారటం దురదృష్టకరమని అన్నారు. ఎంఈఓ సీజ్ చేసిన అన్ని పాఠ్యపుస్తకాలు ఇతర వస్తువులను ప్రభుత్వం స్వాధీన పరుచుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఎంఈఓ కార్యాలయాన్ని కూడా మొట్టడిస్తుందని హెచ్చరించారు.

**రెసోనన్స్ లో ఫీజుల దోపిడి :** మైలవరం పట్టణంలోని రెసోనన్స్ పేరుతో నడుస్తున్న ప్రైవేట్ కాలేజీ లో ఫీజుల దోపిడీ ఎక్కువ అయిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు ఆరోపించారు.గత రెండు సంవత్సరాల నుంచి అడ్డగోలుగా పుస్తకాలు అమ్ముతూ సరైన రీతిలో క్లాసులు కూడా జరగకుండా విద్యార్థుల దగ్గర నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు.ఈ కాలేజీకి ఎటువంటి గుర్తింపు కానీ, విద్యా శాఖ నుంచి ఎటువంటి ఆర్డర్స్ కానీ లేకుండానే, పుస్తకాలు ముద్రించి, టీ షర్టు ముద్రించి, పాంప్లెట్లు వేసి అడ్డగోలుగా అడ్మిషన్లు చేసి రూ.40,000 నుంచి రూ.50 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలియజేశారు. ఐఐటి ,జేఈఈ మెయిన్స్ పేరుతో పేద కుటుంబా లను చిదిమేస్తున్నారని, గత ఏడది జేఈఈ మెయిన్స్ ఒక్క విద్యార్థి కూడా క్వాలిఫై కాకపోవడం గమనార్హం అన్నారు.ఇటువంటి కాలేజీలు, స్కూల్స్ విద్యాశాఖ ఉన్నతాధికా రులు నిర్లక్ష్యం వల్లే పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తు న్నాయని అన్నారు.తక్షణమే ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ జోక్యం చేసుకొని రెసోనెన్స్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని,మరోవైపు చైతన్య, నారాయణ, ఇతర ప్రైవేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న పుస్తకాల వ్యాపారాన్ని అరికట్టి యాజమాన్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ శివకృష్ణ, కె.సురేష్, ఎస్ఎఫ్ఐ సీనియర్ నాయకులు, మొక్కలు కత్తి చరణ్ తేజ్, పచ్చళ్ళ మధు, కాప దేవేంద్రనాథ్, సందీపాము ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

● యోగా దినోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యోగా గురువు బాబా రాందేవ్ హాజరు

● ఐజీఎంసీ స్టేడియంతోపాటు డా. బిఆర్ అంబేద్కర్ కళా వేదికలోనూ ఏర్పాట్లు ● జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ




**విజయవాడ, జూన్ 16 (వార్తాప్రభ) :** జూన్ 21న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిధులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ బాబా లు హాజరు కానున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే.ఎస్. విశ్వనాథన్, నగర మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎమ్ ధ్యానచంద్ర, నగర డీసీపీ కృష్ణకాంత్ పటేల్, ఏడీసీపీ ఎన్బీఎమ్ మురళీ కృష్ణ, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు మంతెన వెంకట సత్యనారాయణ రాజు, యోగా గురువు బాబా రాందేవ్ ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం డా. బీఆర్. అంబేద్కర్ కళా వేదికకు చేరుకుని అక్కడ చేస్తున్న ఏర్పాట్లు, ప్రొటోకాల్ తదితర అంశాలపై వారితో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ... దాదాపు 5 వేల మందికిపైగా యోగా సాధకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగు నీరు, వైద్య సేవలు వంటి తగిన ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. పారిశుధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. మున్సిపల్, పోలీసు, రెవెన్యూ, ఆయుష్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా డా. బీఆర్ అంబేద్కర్ కళా వేదికలోనూ యోగా నిర్వహించేలా ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం అక్కడ కూడా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేస్తున్నామన్నారు. శాఖల సమన్వయంతో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు విజయవంతం చేసేందుకు యోగాలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలి

● అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి:

● బీఎల్ఓలకు సూచించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు



**మైలవరం,జూన్ 16 (వార్తాప్రభ) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రజలు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. మైలవరంలో బూత్ నెంబర్ 102లో బుధవారం నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న సవరణ ప్రక్రియ గురించి బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అధికారులు వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పరిశీలించి, డూప్లికేట్ ఓట్లు తొలగించడంతో పాటు మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు.ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించి, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, తొలగింపులు వంటి ప్రక్రియలను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8ల వినియోగం, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.రాజకీయ పార్టీల బీఎల్ఏలు కూడా బీఎల్ఓలకు సహకరించి సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎలాంటి పక్షపాతానికి తావు లేకుండా స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మైలవరంలో ప్రజాదర్బార్

● ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

● భూ వివాదాలు, పింఛన్లు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలపైనే ఎక్కువ ఫిర్యాదులు




**మైలవరం,జూన్ 16 (వార్తాప్రభ) :** మైలవరం పట్టణంలోని శాసన సభ్యుని కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.ముఖ్యంగా రెవిన్యూ సమస్యలే ఎక్కువ వచ్చాయి.భూ వివాదాలు, పింఛన్లు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు తదితర అంశాలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ప్రతి అర్జీదారుడితో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. పలు సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.మైలవరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి వారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించేం దుకు ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అబ్దుల్ దరియ, ఎంపీడివో పానెం అనురాధ, వివిధ శాఖ అధికారులు,కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వసంత కు కృతజ్ఞతలు తెలిపిన ఏపి ఎంపిఎ సభ్యులు

జర్నలిస్టుల సంక్షేమానికి ఎమ్మెల్యే కృష్ణ ప్రసాదు పెద్దపీట వేశారంటూ కితాబు



**మైలవరం,జూన్ 16 (వార్తాప్రభ) :** మైలవరం నియోజకవర్గంలోని జర్నలిస్టులందరికీ హెల్త్ స్కీమ్ కు సంబంధించిన ప్రీమియం ను చెల్లించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఝ్రావీూూా) సభ్యులు మైలవరం పట్టణంలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఒకొక్క జర్నలిస్టుకు హెల్త్ స్కీం ప్రీమియం కింద రూ.1250 చొప్పున సుమారు 150 మంది కి పైగా జర్నలిస్టుకు ఆర్థిక తోడ్పాటు ఎమ్మెల్యే వసంత కల్పించడం జరిగింది.వచ్చే ఏడాది కూడా హెల్త్ స్కీం ప్రీమియం చెల్లించ నున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.మైలవరం ఎమ్మెల్యేగా వచ్చినప్పటి నుంచి జర్నలిస్టుల స్థలాల విషయంలో కరోనా సమయంలో, వివిధ రూపాలలో అనేక సహాయ సహకారాలు అందిస్తూ జర్నలిస్టుల పట్ల అంకితభావంతో పనిచేస్తున్నారని యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, మైలవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బొడ్డు విజయ్ బాబు,రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి మల్లెల శ్రీనివాసరావు, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పామర్తి సత్య, జిల్లా జాయింట్ సెక్రటరీ మన్నే సాంబశివరావు, ప్రెస్ క్లబ్ కోశాధికారి మల్లాది తిరుపతిరావు, మాజీ అధ్యక్షుడు గుంజి నాగరాజు పాల్గొన్నారు.

# బాపులపాడు మండలం రేషన్ డీలర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక



**హనుమాన్ జంక్షన్,జూన్ 16 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం రేషన్ డీలర్స్ నిర్వహించిన సమావేశంలో వేలేరు డీలర్ శ్రీనివాసు అధ్యక్షులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కొత్తపల్లి గ్రామము డీలర్ యనుముల లలిత అసోసియేషన్ ప్రెసిడెంట్ గా ఎన్నుకోవడం జరిగింది. వైస్ ప్రెసిడెంట్ గా రామన్నగూడెం డీలర్ కగ్గ గాంధీ, అధ్యక్షులుగా ఉమామహేశ్వరం డీలర్ ఆరేపల్లి శేఖర్, సెక్రటరీగా ఆకునూరి విజయ జ్యోతి, జాయింట్ సెక్రటరీ పాతూరి ఆనంద్ కుమారి, ట్రెజరర్ గా కొలవెంటి చంద్రశేఖర్, కమిటీ సభ్యులుగా మాతంగి కిషోర్, రెడ్డి రఘుబాబు, పసుపులేటి వీరభద్రరావు, వడ్డే రామకృష్ణ నీ ఎన్నుకున్నారు. తదనంతరం కొత్తగా ఎన్నుకున్న డీలర్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్మార్వోనీ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మార్వో బి మురళీకృష్ణ మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసి, కార్డుదారులకు టైం కి షాపులు తెరిచి, 65 సంవత్సరాలు నిండిన కార్డుదారులుకు అందరికి సక్రమంగా ఇంటి వద్దకి తీసుకుని సరుకులు అందించాలని ఆదేశించారు.

# ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో : మోరంపూడి



**నూజివీడు,జూన్ 16 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం చాట్రాయి మండలం : ఓటర్లు జూలై 14 వరకు జరుగు ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బీ ఎల్ ఓ ల ద్వారా తమ పూర్తి వివరాలతో ఎన్యూమరేషన్ ఫామ్ ను నింపి ఇచ్చి తమ ఓటు జాబితా లో ఉండేలాగా జాగ్రత్తలు తీసుకోవాలని చనుబండ పీ ఏ సీ ఎస్ ఛైర్మన్ మోరంపూడి శ్రీనివాస రావు అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) లో భాగంగా చాట్రాయి మండలం, చనుబండ గ్రామంలో 3 వ బూత్ లో బీ ఎల్ ఓ కోటేశ్వర రావు, బీ ఎల్ ఏ పరసా శ్రీను లతో కలసి మోరంపూడి శ్రీనివాస రావు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫామ్ లు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా చనుబండ 2 వ బూత్ లో కూడా బీ ఎల్ ఓ శోభన్ బాబు తో కలిసి మోరంపూడి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు నెక్కళపు వెంకటేశ్వర రావు, కంచు గిరి రాజు, మొండ్రు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్ బుక్ స్టాల్స్ సీజ్

● ఎస్ఎఫ్ఐ నాయకుల ఆందోళనతో దిగొచ్చిన విద్యాశాఖ అధికారులు ● నారాయణ, చైతన్య, వివేకానంద స్కూల్స్ లలో పుస్తకాలు , యూనిఫాం స్టాల్స్ ను సీజ్ చేసిన ఎంఈవో -2 బాలు నాయక్






**మైలవరం,జూన్ 16 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం పట్టణంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఆయా పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధన లకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బుక్ స్టాల్స్, యూనిఫాం స్టాల్స్ ను మైలవరం మండల విద్యాశాఖ అధికారి-2 ఎల్. బాలు నాయక్ మంగళవారం మధ్యాహ్నం సీజ్ చేశారు. మైలవరం మండలం పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లలో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు, సభ్యులు మంగళవారం స్థానిక నారాయణ పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు.పాఠశాలలో పుస్తకాలు, యూనిఫామ్ ను అమ్మ రాదని నినాదాలు చేశారు.సుమారు రెండు గంటలకు పైగా వారి ఆందోళన కొనసాగింది.దీంతో విద్యాశాఖ అధికారులు దిగివచ్చారు.మైలవరం మండల విద్యాశాఖ అధికారి -2 బాలు నాయక్ ఘటనా స్థలానికి చేరుకున్నారు.ఎస్ఎఫ్ఐ నాయకులు తో మాట్లాడారు.అనంతరం ఎంఈవో బాలు నాయక్ నారాయణ, చైతన్య, వివేకానంద స్కూల్స్ లలో ప్రత్యేక గదుల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పుస్తకాలు, యూనిఫాం స్టాల్స్ ను సీజ్ చేశారు.దీంతో ఎస్ ఎఫ్ ఐ నాయకులు ఆందోళన విరమించారు.

**ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో బుక్స్, యూనిఫాం అమ్మకాలను నిషేధించాలి : SFI..** రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో బుక్స్, యూనిఫాం అమ్మకాలను నిషేధించాలని ఎస్ ఎఫ్ ఐ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడే క్లాసులు నిర్వహించాలని, అధిక ఫీజులు వసూలు చేయరాదని విజ్ఞప్తి చేశారు.ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లలో తప్పనిసరిగా స్టాఫ్ వివరాలు, ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో తెలపాలన్నారు.అలాగే మైలవరం పట్టణంలో ఉన్న ప్రైవేట్ జూనియర్ కళాశాలలో కూడా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కళాశాల ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ ఆందోళన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చెమట వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి కె.సురేష్ ,మండల అధ్యక్షులు యస్. శివకృష్ణ , సీనియర్ ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం. చరణ్ తేజ్, దేవేందర్ నాథ్, సంధి పాము ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కించపర్చడం వల్లే వైసిపికి 11 సీట్లు వచ్చిన బుద్ధి రాలేదు

– తెలుగు మహిళ నియోజవర్గ అధ్యక్షురాలు కొల్లు రమ్య



**గుడివాడ,జూన్ 16 (వార్తాప్రభ) :** మహిళలను అవమాన కరంగా అసభ్యంగా మట్లాడడం వల్లే వైసిపి పార్టీకి ప్రజలు, మహిళలు ఛీ కోట్టడం వల్లే 11సీట్లు వచ్చాయాని అయిన వారి బుద్ధి మారలేదని ఈ సారి 1సీటు కూడ గెలవలేరని తెలుగు మహిళ నియోజవర్గ అధ్యక్షురాలు కొల్లి రమ్య అన్నారు. మంగళవారం స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పట్టణా తెలుగు మహిళా అధ్యక్షా కార్యదర్శిలు యార్లగడ్డ సుధారాణి, గొర్ల శ్రీలక్ష్మీతో కలసి నియోజవర్గ అధ్యక్షురాలు కొల్లు రమ్య మాట్లాడుతూ వైసిపి నాయకుడు గుడివాడ అమరనాథ్ రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనితపై అనుచిత వాఖ్యలు చేయడం సిగ్గు చేటాన్నారు. మహిళాలు గాజులు, ఫౌడర్‌లపై ఇష్టానుసారంగా మాట్లాడిన అమరనాథ్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. నాయకుడి ఏవిధంగా వ్యవహరిస్తాడో అదే విధంగా పార్టీ సభ్యులు అదే విధంగా వ్యవహరిస్తారన్నారు. జగన్ ఏవిధంగా తల్లిని చెల్లిని ఉపయోగించుకుని మోసం చేయడం జరిగిందో అందరికి తెలుసున్నారు. చెల్లి షర్మిలా పాదయాత్ర ద్వార సాధించిన సానుభూతితో, తల్లి విజయమ్మ అశీసులతో ముఖ్యమంత్రి అయి వారిని ఏవిధంగా మోసం చేయడం జరిగిందో ప్రజలు అర్థం అవడం, తల్లి లాంటి భూవనంపై చట్ట సభలో ఏవిధంగా మాట్లాడి ప్రతిపక్షా నాయకుడి కంటి నీరు వచ్చేలా చేయడం వల్లే జగన్‌కు మహిళ బుద్ధి చెప్పి 11 సీట్లతో పక్కన పెట్టిన సిగ్గు లేకుండ, మళ్ళి టిడిపి చెందిన హోమ్ మంత్రిపై అమరనాథ్ లాంటి వ్యక్తులు మహిళని చూడకుండ, బులెట్ ప్రూప్ కార్లుతో ఫౌడర్ రాసుకుని అనే పదలతో వ్యాంగం మాట్లాడిన అమరనాథ్‌ను అరెస్టు చేయాలని, తక్షణమే అయన మహిళాలకు క్షమపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైసిపి నాయకులను తగిన బుద్ధి చేబుతమాని హెచ్చారించారు. ఈ సమావేశంలో మహిళా నాయకులు మల్లిఖా బేగం, అప్పు, వీరమాచినేని శైలజా, గూడపాటి ప్రశాంతి, జోన్నలగడ్డ రామలక్ష్మి, వంగేవరపు సంధ్య, జయశ్రీ, శశికళ, ఈశ్వరిదేవి, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయండి - టిడిపి పట్టణాధ్యక్షుడు పంద్రాజు



**గుడివాడ,జూన్ 16 (వార్తాప్రభ) :** డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోతే అనేక అంటువ్యాధులు ప్రబలి ప్రజలు అంటురోగల బారిన పడతారని తక్షణమే పట్టణంలోని డ్రైనేజీ, శానిటేషన్‌ను మెరుగు పర్చలని పట్టణా టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య మున్సిపల్ కమిషనర్ మనోహర్‌ను కోరారు. స్థానిక స్లాడర్ పేటలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మున్సిపల్ కమిషనర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ ఇటివల ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రతేక నిధులు తీసుకువచ్చి పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమలు చేసి ప్రజల మన్నలను పొందుతునరన్నారు. గతంలో సత్యనారాయణపురం ఏమిధంగా ఉండేదో అందరికి తెలుసున్నారు. నేడు సత్యనారాయణపురంలో చుక్క మురుగునీరు రోడ్ల మీద నిలబడంలేదన్నారు. స్లాడర్ పేటలో శానిటేషన్, డ్రైనేజీ వ్యవస్థపై అధికారులు శ్రద్ధ కనబరచలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లింగం ప్రసాద్, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188